ప్రజాశక్తి

సోమవారం 30 జూన్ 2025 8 పేజీలు



ప్రకాశం



బాపట్ల



మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు రాంభూపాల్

నాడు ప్రత్యక్ష ఎమర్జెన్సీ..

నేడు కనపడని ఎమర్జెన్సీ: సిపిఎం

8లో

పదండి ఇంటింటికీ.!

- ఎమ్మెల్యేలకు కొత్త కార్యక్రమం పెట్టిన సిఎం చంద్రబాబు
- స్వర్ణాంధ్ర తొలి అడుగులో అన్నీ ప్రజలకు చెప్పాలని వినతి
- హామీలు అమలు కానందున జనంలోకి వెళ్లడం ఇరకాటమే..

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

సిఎం చంద్రబాబు టిడిపి ఎమ్మెల్యేలకు కొత్త కార్యక్రమం పెట్టారు. స్వర్ణాంధ్ర తొలిఅడుగులో భాగంగా ఇంటింటికీ తిరగాలని కార్యక్రమాన్ని నిర్దేశించారు. ఆదివారం నాడు మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో జరిగిన అత్యవసర సమావేశానికి జిల్లా నుంచి మంత్రితో పాటు ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జిలు హాజరయ్యారు. ఏడాది పాలన ముగిశాక సిఎం చంద్రబాబు సుదీర్ఘంగా ప్రసంగం చేశారు. పార్టీ ఎమ్మెల్యేలు నెల రోజుల పాటు నియోజకవర్గాల్లో ఇంటింటికీ తిరగాలన్నారు. ప్రజల సమస్యలు పరిష్కరించడం, అందుబాటులో ఉండటంతో పాటు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకుపోవాలన్నారు. ఏం చేశామో చెప్పాలని, చేయలేనివి కూడా కారణాలను వివరించాలని ఎజెండా నిర్దేశించారు. కొందరు ఎమ్మెల్యేల పనితీరు బాగాలేదంటూ పరోక్షంగా చురకలు కూడా వేశారు. ఏడాదిలో చేపట్టిన కార్యక్రమాలను తన ప్రసంగంలో వివరించారు. ఇక ఎమ్మెల్యేలు నియోజకవర్గాల్లో నెల రోజులపాటు తిరగాల్సి ఉంది. వైసిపి గతంలో అధికారంలో ఉన్నపుడు గడపగడపకు కార్యక్రమం పెట్టింది. ఇష్టం ఉన్నా, లేకున్నా అందరినీ తిప్పారు. కొందరు తిరిగారు. కొందరు పూర్తిగా తిరగలేదు. ఈ లోపు ఎన్నికలు రావడంతో వదిలేశారు. ఇప్పుడు ఏడాది పాలన ముగిశాక తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేలకు ఇంటింటికీ వెళ్లాలని కార్యక్రమం పెట్టారు. అయితే ఇప్పటికే ఎమ్మెల్యేలు నియోజకవర్గాల్లో ఏదో అధికారిక, పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. పెళ్లిళ్లు, పేరంటాళ్లు వంటి కార్యక్రమాలకు ఎక్కువగా వెళుతున్నారు. ప్రైవేటు కార్యక్రమాలు ఎక్కువగా ఉంటున్నాయి. ఇక నుంచీ ప్రభుత్వం సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించే ఎజండా కీలకంగా ఉంది. గ్రామాల్లో ఉన్న సమస్యలను పరిష్కరించాలి. ప్రజలకు అందుబాటులో ఉండాలి. ఇదీ ఎజండా. దీన్ని ఏ మేరకు అమలు చేయగలరన్నదే చూడాలి. ఎందుకంటే ఏడాదిగా ఇచ్చిన 2లో

ఎన్నికల హామీలు అమలు చేయాలి

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కంకణాల ఆంజనేయులు

ప్రజాశక్తి-కొండపి

కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలు, సూపర్ సిక్స్ పథకాలను వెంటనే అమలు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కంకణాల ఆంజనేయులు డిమాండ్ చేశారు. కొండపి మండలం పెరిదేపి గ్రామంలోని ఎంఎస్ విజ్ఞాన కేంద్రంలో సిపిఎం మండల కమిటీ సమావేశం ముప్పరాజు చిన్న బ్రహ్మయ్య అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ గత ప్రభుత్వం కంటే సంక్షేమ పథకాలు రెట్టింపుగా అమలు చేస్తామని, సంక్షేమం, అభివృద్ధి తమ ప్రభుత్వానికి రెండు కళ్లలాంటివి అని చెప్పిన కూటమి నాయకులు అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో ఒకటి, రెండు తప్ప మిగిలినవి అమలు చేయ కుండానే సంబరాలు జరుపుకోవటం పట్ల ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారని ఆయన తెలిపారు. ఏడాది 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని, మెగా డిఎస్సి నిర్వహిస్తామని చెప్పి ఏడాదిగా ఒక్క కొత్త ఉద్యోగం ఇవ్వలేదని పేర్కొన్నారు. ఉద్యోగాలు వచ్చేలోపు నిరుద్యోగులందరికీ రూ.3 వేల భృతి చెప్పారని, ఎప్పుడు ఇస్తారో ఇంతవరకు చెప్పలేదని తెలిపారు. ఇంటిలో ఎంత మంది ఆడబిడ్డలు ఉంటే అంతమందికి నెలకు రూ.1500 చొప్పున ఇస్తామని చెప్పి, ఇంత వరకూ ఒక్కరికీ కూడా ఇవ్వలేదని తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఏడాది అమలుకు నోచలేదని తెలిపారు. భరోసా కోసం రైతులు కళ్ళు కాయలు కాసేలా ఎదురుచూస్తున్నారని తెలిపారు. విద్యుత్ ఛార్జీలు, ఆస్తి పన్ను, నిత్యావసరాల ధరలు పెంచి భారాలు ప్రజల మీద మోపటం అన్యాయమని తెలిపారు. మార్క్ ఫెడ్‌ను రంగంలోకి దించి ఇప్పటివరకు పొగాకును ఎందుకు కొనుగోలు చేయలేదని ఆయన ప్రశ్నించారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కెజి మస్తాన్ మాట్లాడుతూ కూటమి పార్టీలు అధికారంలోకి వస్తే కొండపి నియోజకవర్గం లో సంగమేశ్వరం ప్రాజెక్ట్ పూర్తి చేస్తామని హామీ ఇచ్చారని ఇంత వరకు నిధులు కేటాయించ లేదని అన్నారు. ఈ ప్రాంతం లో రైతులు వేసిన పొగాకు, వరి, శనగ, మిర్చి పంటలకు గిట్టుబాటు ధర లేదని అన్నారు. రైతుల వద్దకు పంటల డబ్బు రానందున కూలీలకు ఇవ్వలేక చాలా ఇబ్బంది పడుతున్నారని అన్నారు. గ్రామీణ ఆర్థిక పరిస్థితులు ఆందోళన కరంగా ఉన్నాయని అన్నారు. ఈ సమావేశంలో సిపిఎం మండల కార్యదర్శి మల్లెల కొండయ్య, మండల నాయకులు ఎం.చిన్న పేతురు, ఎ. విశ్రాంత, అంగాలకుర్తి బ్రహ్మయ్య, వి.రూబెన్, మల్లెల పెద్ద పేతురు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కంకణాల ఆంజనేయులు



పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనాలు

పొదిలిలో కార్డెన్ సెర్చ్

37 బైక్‌లు, 2 ఆటోలు, కారు సీజ్

ప్రజాశక్తి-పొదిలి

దర్శి డిఎస్పి ఆధ్వర్యంలో పొదిలిలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. 37 ద్విచక్ర వాహనాలు, రెండు ఆటులు కారు సీజ్ చేశారు. పట్టణంలోని ట్రైలర్స్ కాలనీలో ఆదివారం ఉదయం దర్శి డిఎస్పి బి.లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ఇంటింటినీ తనిఖీ చేసి పరిశీలించారు. ఈ సందర్భంగా సరైన పత్రాలు లేని 37 మోటార్ బైకులు, రెండు ఆటోలు, ఒక కారును పోలీస్ స్టేషన్ తరలించి సీజ్ చేశారు. ఈ సందర్భంగా దర్శి డిఎస్పి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ వాహన చోదకులు సరైన పత్రాలు కలిగిన వాహనాలు మాత్రమే కొనుగోలు చేయాలన్నారు. ఎవరైనా సరే వాహనాలకు సంబంధించిన సరైన పత్రాలు లేకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో దర్శి డిఎస్పి లక్ష్మీ నారాయణ, పొదిలి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, పొదిలి, తర్లుపాడు ఎస్ఐలు వి.వేమన, బ్రహ్మనాయుడు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-గిద్దలూరు

గిద్దలూరు సబ్ డివిజన్ పరిధిలోని కంచిపల్లె సబ్ స్టేషన్ పరిధిలో కె.బయనపల్లి గ్రామంలో ఆర్డిఎస్ఎస్ విద్యుత్ పనుల కారణంగా సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈఈ కె వెంకటేశ్వర్లు తెలిపారు. కంచిపల్లి, అక్కలరెడ్డి పల్లి, రాజుపేట, వెంకటాపురం గ్రామాలలో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1గంటల వరకు విద్యుత్ సరఫరా, వ్యవసాయ విద్యుత్ నిలిపివేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి విద్యుత్ శాఖకు సహకరించాలని ఆయన కోరారు.

పదండి ఇంటింటికీ.!

(మొదటిపేజీ తరువాయి)

హామీలు అమలు పూర్తిస్థాయిలో లేదు. సూపర్‌సిక్స్‌లోని పథకాలే పూర్తిగా ఆచరణలోకి రాలేదు. రెండు అమలులో ఉండగా మిగతావి చేస్తామంటున్నారు. వాటిపైనే ఎక్కువగా ఓటర్ల దృష్టి ఉంది. మహిళలకు రూ.1500 కోసం ఎదురుచూస్తున్నారు. రైతులకూ పెట్టుబడి సాయం రాలేదు. ఇప్పటి వరకూ ఏడాదికి మూడు సిలిండర్లు, మొన్న తల్లికి వందనం కింద సాయం అందించారు. అయితే ఏడాదిగా ఎదురుచూశారు. దీని వల్ల ఈ రెండు పథకాలకు ఆశించిన స్థాయిలో స్పందన రాలేదు. పథకాలు అమలు చేయలేదనే చర్చ ఎక్కువగా ఉంది. పేదల్లోనూ ఇదే ఉంది. ఏదో ఒకటి చెప్పుకుంటూ వచ్చారు. ఇంటింటికీ వెళ్లినప్పుడు జనానికి ఎమ్మెల్యేలు ఏం చెబుతారన్నదే చూడాలి. పథకాలు పెద్ద ఆటంకంగా మారనున్నాయి. ఇవే ఇపుడు ఎమ్మెల్యేలకు సవాలుగా ఉన్నాయి. జిల్లాస్థాయిలో ఇచ్చిన హామీలు కూడా పెండింగులోనే ఉన్నాయి. మార్కాపురం జిల్లా, వెలుగొండ, పరిశ్రమలు, పెండింగు సాగునీటి ప్రాజెక్టులు, తాగునీటి సమస్యలు కొనసాగుతున్నాయి.వెనుకబడిన జిల్లాగా గుర్తించినా ప్రత్యేకంగా ఎటువంటి ప్యాకేజీలు రాలేదు. గతానికి ఇప్పటికీ పెద్ద తేడా ఏమీ లేదు. పాలన మారిందే తప్ప అభివృద్ధిలో పెద్దగా మార్పు గానీ, మార్క్ గానీ కనిపించడం లేదు. సంక్షేమం ఎజెండా కూడా నత్తనడకన సాగుతోంది. ఏదేమైనా ఇపుడు ఇంటింటికీ తిరగాలి. అప్పుడే ఎమ్మెల్యేల పనితీరు బాగుంటుందనే అభిప్రాయంలో సిఎం చంద్రబాబు ఉన్నారు. వచ్చే నెల నుంచీ ఈ కార్యక్రమం లాంచనంగా ప్రారంభం కానుంది.

గ్రంథాలయం..తాళాలు తీయం

నిరుపయోగంగా లైబ్రరీ భవనం

బోర్డుకే పరిమితమైన వైనం

ప్రజాశక్తి- సీఎస్‌పురం రూరల్

సీఎస్‌పురంలోని సందుగడ్డ వీధిలో ఓ ప్రైవేటు భవనంలో ప్రభుత్వం గ్రంథాలయం ఏర్పాటు చేసింది. రెగ్యులర్ గ్రంథపాలకుడు లేకపోవడంతో ఇన్‌ఛార్జి గ్రంథపాలకుడిని నియమించారు. గ్రంథాలయం అనే బోర్డు ఉంటుందే కానీ ఎప్పుడూ గ్రంథాలయం తలుపులు తీసిన దాఖలాలు లేవు. దీంతో సీఎస్ పురంలో గ్రంథాలయం కూడా ఉది అనే విషయమే ప్రజలు మర్చిపోయారు. దీని గురించి చర్చ వచ్చిన చోట గ్రంథాలయమా? అదెక్కడుంది అంటూ చమత్కరిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రెగ్యులర్ గ్రంథపాలకుడిని నియమించి గ్రంథాలయం తెరచి ఉంచేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



తాళం వేసి ఉన్న గ్రంథాలయ భవనం

12న ఒంగోలులో సదస్సు

దళిత నేత నీల నాగేంద్రరావు వెల్లడి

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

తెనాలి నడిరోడ్డుపై దళిత యువకులపై కూటమి ప్రభుత్వ ఖాకీ హింసకు వ్యతిరేకంగా జులై 12వ తేదీన ఒంగోలులో సదస్సు నిర్వహిస్తున్నామని దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షులు నీలం నాగేంద్రరావు తెలిపారు. స్థానిక సమితి కార్యాలయంలో ఆదివారం జరిగిన పాత్రికేయుల సమావేశంలో నీలం నాగేంద్రం మాట్లాడుతూ తెనాలి నడిరోడ్డులో దళిత ముస్లిం యువకులపై తాలిబాన్ తరహా పోలీస్ థర్డ్ డిగ్రీ వీడియో వైరల్ అయిన బాధ్యులైన సిఐలు రాములు నాయక్, రమేష్ బాబులపై ఎస్‌సి, ఎస్‌టి కేసు కట్టలేదన్నారు. ఈ దాడిని చేయించిన గుంటూరు ఎస్‌పిని సస్పెండ్ చేయలేదన్నారు. కార్యక్రమంలో మాల మహానాడు జిల్లా అధ్యక్షులు రారా అంజయ్య, కార్యదర్శి కాకుమాను రవి ఇతర సంఘాల నాయకులు కసుకుర్తి ఆమెన్ రాజ్, గర్నెపూడి యోహాన్, ఎర్రమోతు నారాయణ, అక్కయ్య పాల్గొన్నారు.

జెవివి జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కమిటీ సభ్యులు స్వరూపరెడ్డి

ప్రజాశక్తి-గిద్దలూరు

ఆగస్టు 9, 10 తేదీలలో జనవిజ్ఞాన వేదిక ప్రకాశం జిల్లా 18వ మహాసభలు గిద్దలూరులో నిర్వహిస్తున్నట్లు జనవి జ్ఞాన వేదిక రాష్ట్ర కమిటీ సభ్యులు పి.స్వరూపరెడ్డి తెలిపారు. ఆదివారం గిద్దలూరులోని స్ప్రింగ్ బోర్డ్ హైస్కూల్లో జెవివి జిల్లా కార్యదర్శివర్గ సమావేశం జిల్లా అధ్యక్షులు మండ్లా శ్రీనివాసులు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ గత 38 సంవత్సరాలుగా జన విజ్ఞాన వేదిక శాస్త్రీయ సమాజ ఏర్పాటు లక్ష్యంగా పనిచేస్తున్నదని అన్నారు. మూఢ నమ్మ కాలు నిరోధించేందుకు, ప్రజలలో సైన్సు, శాస్త్రీయ దృక్పథాన్ని వ్యాప్తి చేయడం ద్వారా సమాజ అభివృద్ధికి కృషి చేస్తున్న జెవివి జిల్లా మహాసభలను విజయవంతం చేసేందుకు ఉద్యోగులు, ఉపాధ్యాయులు, విద్యావంతులు తగు సహాయ, సహకారాలు అందించాలని స్వరూపరెడ్డి కోరారు. జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్ జయప్రకాశ్ మాట్లాడుతూ యుద్ధాలు వద్దని, ప్రపంచ శాంతి కోసం, పర్యావరణ పరిరక్షణ, సామాజిక న్యాయం, మానవ విలు వలు, ప్రశ్నించే తత్వాన్ని పెంపొందింపజేసేందుకు జెవివి కృషి చేస్తున్నదని అన్నారు. రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన అనేకమంది సైంటిస్టులు, వైద్యులు, ఉద్యోగులు, ఉపాధ్యా యులు, విద్యార్థులు, యువకులు, మహిళలు, మధ్యతరగతి మేధావులు, వృత్తి నిపుణులు దాదాపు 30 వేలకు పైగా సభ్యులున్న అతి పెద్ద సైన్స్ ప్రచార సంస్థ 'జనవిజ్ఞాన వేదిక' అని జయప్రకాష్ అన్నారు. జెవివి ఉపాధ్యక్షులు షేక్ ఖాజా హుస్సేన్, యు వెంకట్రావు మాట్లాడుతూ పాఠశాల విద్యార్థుల్లో తార్కిక ఆలోచన రేకెత్తించేందుకు, పిల్లల్లో దాగివున్న సజనాత్మకతను వెలికితీసేందుకు అవగాహన తరగతులు, చెకుముకి సైన్స్ సంబరాలు, సమ్మర్ క్యాంపులు, చెకుముకి సైన్స్ మాసపత్రిక ద్వారా గత నాలుగు దశాబ్దాలుగా జనవిజ్ఞాన వేదిక నిర్మాణాత్మక కృషి చేస్తోందని అన్నారు. అనంతరం ఈ సమావేశంలో జెవివి జిల్లా మహాసభల గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జెడ్ రమణయ్య, ఏ విశ్వరూపం, ఎస్ఎం డి రఫీ, జి శ్రీనివాసరెడ్డి, జె శేఖర్, డి బాలునాయక్, గిద్దలూరు డివిజన్ మండలాల నాయకులు ఎ.మల్లికార్జున రావు, ఎం తిరుపతిరెడ్డి, ఎ అల్లూరయ్య, వి శ్రీనివాసులు, గోపాల్, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



జిల్లా మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జెవివి నాయకులు

నాడు ఉపాధికి కేంద్రం..

నేడు దొంగలకు అడ్డా

- గుళ్లాపల్లి గ్రోత్‌సెంటర్‌లో దుస్థితి ఇదీ..

- ఫ్యాక్టరీల్లోని విలువైన వస్తువులు అపహరణ

ఆవేదనలో ఫ్యాక్టరీల యాజమానులు

ప్రజాశక్తి-మద్దిపాడు

ఒకప్పుడు వేలాది మందికి ఉపాధి కల్పించిన కేంద్రం అది... ప్రస్తుతం దాని రూపు రేఖలే మారాయి. దానిపై ఎలాంటి పర్యవేక్షణ లేకపోవడంతో నేడు దొంగలకు అడ్డాగా మారింది. ఫ్యాక్టరీలు మూతపడటంతో అందులోని విలువైన వస్తువులు దొంగల పాలవుతున్నాయి. ఇనుప సామాన్ల వ్యాపారులకు ఆదాయం కల్పించే కేంద్రంగా మారింది. ప్రస్తుతం గ్రోత్‌సెంటర్‌లో నెలకొన్న పరిస్థితి ఇదీ.

గ్రోత్ సెంటర్‌లో 70 శాతం మేర ఫ్యాక్టరీలు మూత పడ్డాయి. అక్కడ వాచ్‌మెన్లు లేకపోవడం ఆయా ఫ్యాక్టరీలలో ఉన్న విలువైన వస్తువులను దొంగలు దోచుకెళ్లి సొమ్ము చేసుకుంటున్నారు. గ్రోత్‌సెంటర్‌లో 6కు పైగా పాత ఇనుప సామాన్లు కొనే (స్కాబ్) షాపులు ఉన్నాయి. అవి నేషనల్ హైవే పక్కనే ఉన్నాయి. కొంతమంది పగలు ఇండ్రస్టీయల్ ఏరియాలో తిరిగి ఎక్కడ ఏ ఫ్యాక్టరీ ఉంది. అందులో విలువైన వస్తువులు ఎమి ఉన్నాయో చూసుకుని



ఇండ్రస్టీయల్ ఏరియా బోర్డు

రాత్రుల్లో వాటిని చోరీ చేస్తున్నారు. చోరీ చేసిన విలువైన వస్తువులను గ్రోత్‌సెంటర్‌లో పాత ఇనుము షాపుల్లో అమ్ముతున్నట్లు సమాచారం. పాత ఇనుము షాపుల యజమానులే కొంత మందిని ఒక ముఠాగా ఏర్పాటు చేసి వారి చేత చోరీలు చేయిస్తున్నట్లు ప్రచారం జరగుతోంది. వ్యవసాయ పొలాల వద్ద ఉండే మోటార్లు, వైర్లు, కేబుల్ , ప్లాస్టిక్ వస్తువులను కూడా చోరీ ఇక్కడే అమ్ముతున్నారనే ప్రచారం కూడా ఉంది. ఆ షాపుల ఎదుట పెద్ద ఎత్తున వాహనాలు ఆపుతుండటం ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. నేషనల్ హైవేపై వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎవరైనా ఇదేమని ప్రశ్నిస్తే ప్రతినెలా అధికారులకు మాముళ్లు పంపుతున్నాం. మమ్మల్ని ఏం చేస్తారు అనే సమాధానం ఆ షాపుల యజమానుల నుంచి వస్తుంది.

గ్రోత్ సెంటర్‌లో కొరవడిన పర్యవేక్షణ

ఫ్యాక్టరీలలో విలువైన వస్తువులు అపహరణకు గురవుతున్నా ఆయా ఫ్యాక్టరీ యజమానులు చూస్తూ ఉండటం తప్పా ఏం చేయలేకపోతున్నారు. పరిశ్రమలు మూతబడటంతో ఫ్యాక్టరీల వద్ద వాచ్‌మెన్లను పెట్టే పరిస్థితిలో కూడా తమకు లేదని వారు చెబుతున్నారు. పోలీసులకు ఫిర్యాదు చేసినా స్పందన అంతగా ఉండటం లేదని అంటున్నారు. అదేమని అడిగితే మీ సామాన్లకు మీరే బాధ్యులు అనే సమాధానం పోలీసుల నుంచి వస్తుందని పేర్కొంటున్నారు. ఎపిఐఐసిని సెక్యూరిటీ గార్డ్స్ సంఖ్యను పెంచాలని కోరినట్లు వారు తెలిపారు. గత కొన్ని నెలలుగా ఇండ్రస్టీయల్ ఏరియాలో లైట్లు వెలగకపోవడం, ఎలాంటి పర్యవేక్షణ లేకపోవడంతో దొంగలకు కలిసి వస్తుందని వారు తెలిపారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఎపిఐఐసిని సెక్యూరిటీ గార్డ్సను చోరీలను అరికట్టాలని ఫ్యాక్టరీల యాజమానులు కోరుతున్నారు.



ఆత్మాహత్యాయత్నానికి పాల్పడిన లక్ష్మి

మర్రిపూడి ఎస్ఐ వేధిస్తున్నారంటూ...

మహిళ ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి-మర్రిపూడి

అన్నదమ్ముల మధ్య ఏర్పడిన వివాదంలో మర్రిపూడి ఎస్ఐ రమేష్ వేధిస్తున్నారంటూ ఓ మహిళా ఆత్మ హత్యాయత్నానికి పాల్పడింది. ఈ ఘటన ఆదివారం చోటు చేసుకుంది. అందిన వివరాల ప్రకారం... మర్రిపూడి మండలం గుండ్ల సముద్రం గ్రామానికి చెందిన దేవరపల్లి లక్ష్మీనరసారెడ్డి, దేవరపల్లి రామిరెడ్డి అన్నదమ్ములు. వీరికి ఉమ్మడిగా పొగాకు బ్యారెన్ ఉంది. బ్యారన్ విషయంలో వారి మధ్య గొడవ జరుగుతోంది. గత కొంతకాలంగా లక్ష్మీ నర్సారెడ్డి బ్యారెన్‌ను వినియోగించుకుంటున్నాడు. తనకు అవకాశం ఇవ్వడం లేదని ఆగ్రహించిన తమ్ముడు రామిరెడ్డి బ్యారన్‌కు తాళం వేశాడు. ఈ విషయమై లక్ష్మీ నరసారెడ్డి గత నెల 23న పోలీస్ స్టేషన్ ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేశారు. లక్ష్మీ నరసారెడ్డి, ఆయన వరమ్మ తరచూ తమను అసభ్య పదజాలంతో వేధిస్తూ ఇంట్లోని వస్తువులు ధ్వంసం చేస్తున్నట్లు రామిరెడ్డి చెబుతున్నాడు. ఈ క్రమంలో ఎస్ఐ ప్రతిరోజూ పోలీసుస్టేషన్‌కు పిలిపించి ఉదయం నుంచి సాయంత్రం వరకూ అక్కడే కూర్చోబెడుడుతున్న రామిరెడ్డి దంపతులు చెబుతున్నారు. తమకు జరిగిన అన్యాయంపై ఫిర్యాదు చేసినా తీసుకోవడం లేదని తెలిపారు. ఇదేమని అడిగితే బూతులు తిట్టేవారని వారు తెలిపారు. ప్రతిరోజూ ఎస్ఐ వేధింపులతో, దూషణలతో మనస్తాపానికి గురైన తన భార్య లక్ష్మి ఆదివారం నిద్ర మాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు రామిరెడ్డి వాపోయాడు. బాధితురాలిని పొదిలిలోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు.

పోక్సో కేసు నమోదు

ప్రజాశక్తి-కొమరోలు : బాలికపై లైంగిక దాడి జరినట్లు అనుమానం వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోక్సోచట్టం కింద కేసు నమోదు చేసినట్లు కొమరోలు ఎస్ఐ నాగరాజు తెలిపారు. ఎస్ఐ కథనం... గిద్దలూరుకు చెందిన బాలిక ఈ నెల 26న కుమారి అనే మహిళతో వెళ్లింది. అప్పటి నుంచి బాలిక కనిపించలేదు. దీంతో ఆమె తల్లిదండ్రులు ఆచూకీ కోసం గాలించారు. కొమరోలు మండలం తాటిచెర్ల మోటులో హోటల్ నిర్వహిస్తున్న కడప జిల్లా కలసపాడు మండలం చెన్నుపల్లి గ్రామానికి చెందిన కానె చంద్రశేఖర్ అనే వ్యక్తి వద్ద ఉన్నట్లుగా గుర్తించారు. తమ కుమార్తై ఆచూకీ తెలపాని చంద్రశేఖర్‌ను నిలదీశారు. దీంతో బాలిక తల్లికి చంద్రశేఖర్‌కు వాగ్వాదం చోటు చేసుకుంది. చివరకూ ఈ నెల 27న బాలిక తల్లి కొమరోలు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. తమ కుమార్తైపై చంద్రశేఖర్ లైంగిక దాడికి పాల్పడినట్లు ఫిర్యాదులో పేర్కొంది. పోలీసులు కేసు నమోదు చేసి వివరాలను మార్కాపురం డిఎస్‌పి నాగరాజు, గిద్దలూరు సిఐ రామకోటయ్యకు తెలియజేశారు. డిఎస్‌పి నాగరాజు, గిద్దలూరు సిఐ రామకోటయ్యతో కలిసి ఎస్ఐ, పోలీసు సిబ్బంది తాటిచెర్ల మోటుకు వెళ్లి ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. బాలిక తల్లి వ్యక్తం చేసిన అనుమానాల మేరకు బాలికను వైద్య పరీక్షలకు తరలించినట్లు ఎస్ఐ నాగరాజు మెడికల్ రిపోర్టు వచ్చిన తర్వాత కేసు దర్యాప్తు ముమ్మరం చేస్తామని తెలిపారు.

చెట్లు తొలగింపు

ప్రజాశక్తి-టంగుటూరు : ఆర్‌టిసి బస్సులు బస్టాండ్ లోనికి వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఇటీవల టిడిపి నాయకులు అధికారులను కోరారు. దీంతో ఆర్‌టిసి బస్సులు బస్టాండ్ లోపలికి వెళ్లి ప్రయాణికులను ఎక్కించుకోవాలని అధికారులు డ్రైవర్లకు ఆదేశాలు ఇచ్చారు. అందులో భాగంగా బస్సులు బస్టాండ్‌లోకి వచ్చేందుకు అడ్డుగా చెట్లను జెసిబితో తొలగించారు. చెట్లను తొలగింపును డిఇ కిరణ్ పర్యవేక్షించారు.

7న ఎంఆర్‌పిఎస్ ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి-మద్దిపాడు : ఎంఆర్‌పిఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని జులై7న ఘనంగా నిర్వహించాలని ఎంఆర్‌పిఎస్ సీనియర్ నాయకుడు రెబ్బవరపు ప్రభాకర్ తెలిపారు. ఎంఆర్‌పిఎస్ మండల కార్యవర్గ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ ప్రతి మాదిగ పల్లెలో జెండాను ఆవిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ నాయకులు మందా చిన్నయ్య, సిరిమళ్ల ఆదాము, దుడ్డు వినోద్ కుమార్, దుద్దుకూరి డేవిడ్, తాతపూడి నాగరాజు పాల్గొన్నారు.

రూ.కోటిన్నర విలువైన ...

చెరువు పోరంబోకు స్థలం ఆక్రమణ



ఆక్రమణదారులు చదును చేసిన స్థలం ఇదే..

ప్రజాశక్తి- పొన్నలూరు

పొన్నలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బినిడి వెంకట్రావు ఉదోగ్య విమరణ చేశారు. అందులో భాగంగా ఆదివారం వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దామచర్ల పూర్ణచంద్రరావు, వివిధ పార్టీల నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొని వెంకట్రావును ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ వెంకట్రావు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఎంతో అభివృద్ధి చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దివి లింగయ్య నాయుడు, టిడిపి మండల అధ్యక్షుడు అనుమోలు సాంబశివరావు, మాజీ అధ్యక్షుడు మండవ ప్రసాద్, మాజీ సర్పంచి పల్లపోతు ప్రసాద్, గుమ్మళ్ల వెంకట్రావు,మండవ మురళీమోహన్, దాసరి కృష్ణారావు, మన్నెం మల్లికార్జున, పిడికిటి వెంకట్రావు, పల్లపోతు వెంకట్రావు. ఉపాధ్యాయులు

ఎన్‌రోల్‌మెంట్ పెంచాలి : యుటిఎఫ్



మాట్లాడుతున్న కె.శ్రీనివాసరావు

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్‌రోల్‌మెంట్ పెంచాలని యుటిఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కొమ్మోజు శ్రీనివాసరావు యుటిఎఫ్ శ్రేణులకు పిలుపునిచ్చారు. స్థానిక కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షుడు షేక్ అబ్దుల్ హై అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ సమాజంలో నాణ్యమైన, సమానమైన విద్య అందాలంటే ప్రభుత్వ విద్యావిధానం బల పడాలన్నారు. యుటిఎఫ్ కార్యకర్తలందరూ ఈ కార్యక్రమంలో పాలుపంచు కోవాలన్నారు. యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి డి.అంజనేయులు మాట్లాడుతూ బదిలీలు ప్రమోషన్స్ జరిగాయని, ఉపాధ్యాయు లందరికీ బోధనేతరపనులు తగ్గించి ఎన్‌రోల్ మెంట్ మెంట్ పెంచేలా వాతావరణాన్ని కల్పించాలని కోరారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు షేక్ అబ్దుల్ హై మాట్లాడుతూ యుటిఎఫ్ కార్యకర్తలు అదనంగా పని చేసి పాఠశాలను సమాజానికి దగ్గరకు చేర్చాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య, విలువలు నేర్చాలని కోరారు.ఈ సమావేశంలో యుటిఎఫ్ గౌరవాధ్యక్షుడు ఎస్.రవి, సహధ్యక్షులు జి. ఉమామహేశ్వరి, కోశాధికారి చిన్నస్వామి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాజసులోచన. యుటిఎఫ్ జిల్లా కార్య వర్గ సభ్యులు, మండల శాఖ అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.

పులి దాడిలో ఆవులు మృతి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

పెద్దపులి దాడిలో రెండు ఆవులు మృతి చెందాయి. ఈ ఘటన నల్లమల అటవీ ప్రాంతంలోని పాలుట్ల గిరిజన గూడెంలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. ఈ దాడిలో రెండు ఆవులు మృతి చెందాయి. పులి దాడిలో రూ. లక్ష విలువైన రెండు ఆవులను కోల్పోయినట్లు బాధితుడు కొడావత్ నానికే నాయక్ తెలిపారు. ఈ నెల 13న ఆవుల మందపై పులి దాడి చేయడంతో రెండు ఎద్దులు మృతిచెందినట్లు గిరిజనులు తెలిపారు.

రెండు రోజుల్లో

సాగర్ నీటి సరఫరా నిలుపుదల

ప్రజాశక్తి-చీమకుర్తి

రెండు రోజుల్లో రామతీర్థం రిజర్వాయర్ నుంచి సాగర్ నీటి విడుదలను నిలిపివేస్తున్నట్లు ఎస్ వరలక్ష్మి తెలిపారు. వేసవి దష్ట్యా మంచి నీటి కోసం రామతీర్థం రిజర్వాయర్ నుంచి గత 25 రోజులుగా నీటిని క్రిందికి విడుదల చేసినట్లు తెలిపారు. ఈపాటికే ఒంగోలు-1 సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును 90 శాతం సాగర్ నీటితో నింపినట్లు తెలిపారు. రిజర్వాయర్ కింద ఉన్న దాదాపు 45 నోటిఫైడ్ చెరువులను కూడా పూర్తిస్థాయిలో నింపినట్లు ఆమె తెలిపారు. ప్రస్తుతం రామతీర్థం రిజర్వాయర్లో 82 మీటర్ల నీటిమట్టం ఉన్నట్లు తెలిపారు. ఆదివారం నాటికి రిజర్వాయర్ నుంచి 150 క్యూసెక్కుల నీటిని కిందకు వదులుతున్నట్లు తెలిపారు. ప్రజల మంచినీటి అవసరాల దష్ట్యా సాగర్ నీటితో చెరువులన్నిటినీ నింపినట్లు తెలిపారు. నీరు వృథా కాకుండా కట్టుదిట్టంగా చర్యలు చేపట్టినట్లు తెలిపారు.



ఎంఈఓ సుబ్బారావును సన్మానిస్తున్న దృశ్యం

ఎంఇఒ సుబ్బరావుకు ఘన సన్మానం

ప్రజాశక్తి - ముండ్లమూరు

స్థానిక ఎపి మోడల్ స్కూల్ నందు ఎంఇఒ జె సుబ్బారావు ఉద్యోగ విరమణ సన్మాన సభ ఎంఈఓ2 ఎం వెంకటేశ్వర్లు అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా దర్శి విద్యా శాఖ అధికారి కాకర్ల రఘురామయ్య మాట్లాడుతూ గత 33ఏళ్ల నుండి ఉపాధ్యాయుడిగా విద్యార్థులకు సేవలందించి, విద్యా శాఖ అధికారిగా పనిచేస్తూ ఎంతో మంది ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లి, దండ్రుల నుండి మన్ననలు పొందిన వ్యక్తి సుబ్బారావు అని ప్రశంసించారు. ఆయన సేవలు కొనియాడారు. అనంతరం ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాలైన యుటిఎఫ్, ఎపిటిఎఫ్ సంఘాల నాయకులు సుబ్బారావును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

9న దేశవ్యాప్త సమ్మె

ప్రజాశక్తి - ముండ్లమూరు

మండల కేంద్రంలో కత్తి తిరపతమ్మ అధ్యక్షతన సిఐటియు సమావేశం ఆదివారం నిర్వహించారు. సమావేశంలో సిఐటియు జిల్లా కార్యదర్శి పి కల్పన మాట్లాడారు. కార్మికుల హక్కుల సాధన కోసం జులై 9న దేశావ్యాప్తంగా జరిగే సమ్మెలో స్కీం వర్కర్స్, కార్మికులు పాల్గొని జయ ప్రదం చెయాలని కోరారు. సిఐటియు మండల కార్యదర్శి బోడపాటి హనుమంతరావు మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం అమలు చేయబోతున్న లేబర్ కొడ్స్ రద్దు చేయాలని అన్నారు. కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు, మధ్యాహ్న భోజన కార్మికులు, స్వచ్ఛ భారత కార్మికులు, విఆర్ఎలు పాల్గొన్నారు.

'కేంద్రీయ విద్యాలయం'కు దరఖాస్తు చేసుకోవాలి

ప్రజాశక్తి - బాపట్ల

సూర్యలంక ఎయిర్ ఫోర్స్ స్టేషన్ కేంద్రీయ విద్యాలయంలో 1వ తరగతి నుంచి 12వ తరగతి (సిబిఎస్ఇ బోర్డు) వరకు మిగిలిపోయిన సీట్లకు దరఖాస్తులు స్వీకరిస్తునట్లు ప్రిన్సిపల్ వి మృదుల ఆదివారం తెలిపారు. వివరాలకు విద్యాలయంలో సంప్రదించాలని అన్నారు. జులై 10 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని అన్నారు. మరిన్ని వివరాలకు 08643 295028, 9014919388 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలని తెలిపారు.



అవార్డులు అందుకుంటున్న రోటరీ ప్రతినిధులు

సింగరకొండ రోటరీక్లబ్‌కు అవార్డులు

ప్రజాశక్తి - అద్దంకి

హైదరాబాద్ కొంపల్లి హిందవ గౌరీక్ ఫంక్షన్ హాల్లో ఆదివారం జరిగిన అవార్డ్స్ నైట్ ప్రోగ్రాంలో శింగరకొండ రోటరీ క్లబ్ రోటరీ 3150 జిల్లాలోనే ఎక్కువ సేవా కార్యక్రమాలు చేసి నందుకు జిల్లా గవర్నర్ కాట్రగడ్డ శరత్ చౌదరి రెండు గోల్డెన్ ఛాంపియన్ అవార్డులు, మూడు సిల్వర్ అవార్డులు, ఎక్కువ రక్త దానాలు చేయించినందుకు చుండూరి మురళీ సుధాకరరావుకు స్పెషల్ అవార్డు, 10 సేవా సర్టిఫికెట్స్‌తో సత్కరించారు. వీరవల్లి సుబ్బారావు (రుద్రయ్య)ను పిల్లర్ ఆఫ్ ది క్లబ్ అవార్డుతో ప్రత్యేకంగా సత్కరించారు. కార్యక్రమంలో రోటరీ అధ్యక్షులు చప్పిడి వీరయ్య, సెక్రటరీ చుండూరి మురళీ సుధాకరరావు, ట్రెజరర్ మలాది శ్రీనివాసరావు, అసిస్టెంట్ గవర్నర్ షేక్ మహమ్మద్ రఫీ, అద్దంకి లేవి ప్రసాద్, సందిరెడ్డి శ్రీనివాసరావు, వీరవల్లి రుద్రయ్య, అలహరి హరి ప్రసాద్, పుట్టంరాజు శ్రీ రామచంద్ర మూర్తి, పువ్వాడ రామకోటేశ్వరరావు, అంజాద్ బాషా, కాకర్ల వెంకటేశ్వర్లు, సంకా బాబు, చామర్తి గురుశేఖర్, తమ్మన శ్రీనివాసరావు, జాగర్ల మూడి శివకుమారి, కోట అంజమ్మ, కుంచాల శ్రీవిద్య పాల్గొన్నారు.

దశాబ్దాలుగా బోట్లు నడుస్తున్న

కాలువ ఒకరి సొత్తు ఎలా?

- సహజసిద్ధంగా ఏర్పడిన కాలువ ఒకరి ఆస్తి ఎలా అవుతుంది?
- సముద్రపు అలల వరకు భూమికి పట్టా ఇవ్వడం ఎలా సాధ్యపడింది?
- సముద్రాన్ని కూడా రి సార్టుల వారికి ధారాదత్తం చేస్తారా?
- మత్స్యకారుల గోడు అధికారులు, ప్రజాప్రతినిధులకు పట్టదా?



పాత చిత్రాలను గమనిస్తే అక్కడి భూ స్వభావం తెలుస్తుంది. సదరు కాలువ భూమి, సముద్రం ఒడ్డున ఉన్న ఇసుక దిబ్బలు ఎలా ఆక్రమణలకు ఎలా గురయ్యాయో వెల్లడవుతుంది.

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

చీరాల, బాపట్ల సరిహద్దులోని సముద్ర తీర ప్రాంతమైన వాడరేవు, విజయలక్ష్మీపురం గ్రామాల మధ్య ఉన్న ఈపురుపాలెం స్ట్రయిట్ కట్ కాలువను దశాబ్దాలుగా ఈ ప్రాంతంలో 9గ్రామాల మత్స్యకారులు తమ బోట్ల రాక పోకలకు వినియోగిస్తున్నారు. ఇక్కడి సముద్రతీరం వెంబటి సహజ సిద్ధంగా ఏర్పడిన కాలువ నుంచి రాక పోకలు సాగిస్తున్నారు. అయితే ఈ కాలువ భూమి తనదంటూ బుర్ల వెంకట్రావు అనే రియల్ ఎస్టేట్ దారుడు అధికారం అండగా సదరు కాలువను ఆక్రమించారు. ఈపురుపాలెం స్ట్రయిట్ కట్ కాలువ సముద్రంలో కలిసే చోట సహజ సిద్ధంగా ఏర్పడిన ఒంపుతో కూడిన కాలువను రియల్ ఎస్టేట్‌దారు పూడ్చివేయడం అత్యంత వివాదాస్పదంగా మారింది. దశాబ్దాల కాలంగా ఇక్కడ స్ట్రయిట్ కాలువ సముద్రం ఒడ్డున వాలుగా ఒంపు తిరిగి అరకిలో మీటరు పైగా ప్రవహించి అక్కడ సముద్రంలో కలుస్తుంది. సముద్రపు అలల తాకిడి నేరుగా కాలువపై పడకుండా ఇక్కడ సహజసిద్ధంగా ఇసుక దిబ్బలు ఏర్పడ్డాయి. మత్స్యకారులు తమ బోట్లను వంపుతో ఉన్న కాలువ నుంచి లోపలికి తీసుకెళ్ళి స్ట్రయిట్ కట్‌లో నిలుపుకోవడం చేసేవారు. ఇలా కాలువ వంపుతో విశాలంగా ఉండడంతో బోట్ల రాకపోకలకు వీలుగా ఉండేది. స్ట్రయిట్ కట్ కాలువ, సముద్రం కలసే ప్రాంత సమీపంలో భూములు కలిగి ఉన్న బుర్ల వెంకట్రావు తన రిసార్టు విస్తరణలో భాగంగా సహజ సిద్ధంగా ఏర్పడిన సము ద్రముఖ ద్వారం (సీ మౌత్) వద్ద ఉన్న కాలువ వంపును పూడ్చి వేసి నేరుగా సము ద్రంలోకి స్ట్రయిట్ కట్‌ను కలపడం జరిగింది. దీంతో బోట్ల రాక పోకలకు ఇబ్బందులు తలెత్తాయి. గతంలో కాలువ ఉన్న ప్రాంతంతో పాటు సముద్రం అలల లోపలి వరకు తనకు చెందిన భూమి ఉందని వెంకట్రావు వాదనలు వినిపిస్తున్నాడు.

ప్రస్తుతం వివాదస్పదమైన బాపట్ల మండలం అడవి రెవెన్యూ పంచాయతీలోని సర్వేనెంబర్ 499-1, 2లోని 3.50 ఎకరాల భూమి ప్రభుత్వానికి చెందింది. సదరు భూమిని వెంకట్రావు పేరుతో డికెటి పట్టా ఇచ్చారు. ఎక్కడైనా పేదలు, బలహీన వర్గాలకు చెందిన వారు ఎవరైనా ప్రభుత్వ భూమిని సాగు చేసుకుంటుంటే డికెటి పట్టా ఇస్తారు. కాని ఇక్కడి భూమి ప్రభుత్వ రికార్డుల ప్రకారం సాగుకు పనికి రానిదిగా ఉంది. సాగు చేయని భూమిని, అదీ ధనిక రైతుకు డికెటి పట్టా ఎలా ఇచ్చారో రెవెన్యూ వారికే తెలియాలి. అది కూడా సముద్రపు ఒడ్డున అలల లోపల వరకు పట్టా భూమి ఉందని చెబుతున్నారు. దశాబ్దాలుగా కాలువగా ఉన్న భూమిని కూడా అధికారులు ధారాదత్తం చేసినట్లు తెలుస్తుంది. మత్స్యకారులు ఆందోళన చేస్తున్నా అధికారులు కాని, ప్రజాప్రతినిధులు గాని పట్టించుకున్న పరిస్థితి లేదు. గతంలో ఎలా అయితే కాలువ ఉందో అలానే పునరిద్ధరించాలని మత్స్యకారులు కోరుతున్నారు. స్ట్రయిట్ కట్ తమ బోట్ల రాకపోకలకు ఏ మాత్రం సరిపోదని చెబుతున్నారు. ఈ కాలువ సంగతి వదిలేయండి, మీకు ఈపురుపాలెం స్ట్రయిట్ కట్‌లో రూ.2 కోట్లతో జెట్టి కట్టిస్తామన్నట్లు అధికారులు చెబుతున్నారు. ఎవరికైన డికెటి పట్టా ఇచ్చినా ప్రజల ప్రయోజనార్థం సదరు భూమిని తిరిగి ప్రభుత్వం తీసుకోవచ్చు. సాగు కోసం ఇచ్చిన భూమిని రియల్ ఎస్టేట్ కోసం వినియోగిస్తున్న కారణంగా ప్రభుత్వం వెనక్కు తీసుకోవచ్చు. మత్స్యకారులు కోరుతున్నట్లు చేయవచ్చు. కాని ఇక్కడ కమిటీలు, విచారణ పేరుతో కాలయాపన చేస్తున్నారు. సర్వే నెంబర్ 499-1, 2లోని 3.50 ఎకరాల వివాదాస్పద భూమిలోకి ఎవరు ప్రవేశించరాదని, భూమిపై బిఎన్ఎస్ 163 యాక్ట్ అమలు చేశామని కలెక్టర్ వెంకటమురళి ప్రకటిస్తూ సదరు భూమి విషయమై సమగ్ర నివేదిక ఇవ్వాలని చీరాల, బాపట్ల ఆర్డీఒలను ఆదేశించారు. మత్స్యకారులు వరస ఆందోళనలు చేస్తున్న ప్రజాప్రతినిధులు మౌనం దాల్చారు. ఎక్కడ లేని విధంగా సముద్రం ఒడ్డున ఉన్న భూములను కూడా రియల్ ఎస్టేట్‌దారులకు ధారాదత్తం చేస్తున్నారు. రియల్ మాయలో ఇక్కడ ఏ నియమ నిబంధనలు వర్తించడం లేదు.

ఈ చిత్రం ఈపురుపాలెం స్ట్రయిట్ కట్ కాలువ సముద్రంలో కలసే ప్రాంతానికి చెందిన పాత చిత్రం. సముద్రం ఒడ్డున కాలువ వంపు తిరిగి ఉంది. ఇక్కడ ఉన్న వాలును బట్టి కాలువ కొంత దూరం ముందుకు వెళ్ళి పాయలాగా సముద్రంలో కలుస్తుంది. ఈ మలుపులో నుంచి మత్స్యకారులు తమ బోట్లను స్ట్రయిట్‌కట్‌లోకి తీసుకెళ్ళి అక్కడ నిలుపుకునే వారు. సముద్రం ఒడ్డున ఇసుక దిబ్బలు సహజంగా ఏర్పడ్డాయి. ఈ కాలువ, ఇసుక దిబ్బలపై ప్రభుత్వానికే హక్కులు ఉంటాయి. ఎగువ బాగాన మూలన ఉన్న భూమి వెంకట్రావుకు చెందింది. అక్కడ ముందుగా చిన్న రిసార్టు కట్టిన వెంకట్రావు ఇప్పుడు అక్కడ ఉన్న కాలువను, ఇసుక దిబ్బలను ఆక్రమించడం జరిగింది. సముద్రం అలల లోపలి వరకు ఉన్న భూమిపై తనకే హక్కు ఉందని చెబుతున్నారు.



వెంకట్రావుకు చెందిన రిసార్టు భవనం. దాని పక్కగా ప్రవహిస్తున్న స్ట్రయిట్‌కట్ కాలువకు సంబంధించినది. కాలువ ప్రవాహ తాకిడికి తన వైపు ఉన్న భూమి కోతకు గురికాకుండా రాళ్ళను అడ్డుగా పెట్టుకోవడం జరిగింది. ఇప్పుడు ఈ కాలువను పూర్తిగా మూసి వేసి ఆక్రమించడం జరిగింది.



రిసార్టు భవనం, తాటిచెట్లతో పెద్ద హట్ వేసి ఉన్న ప్రదేశానికి దిగువన ప్రస్తుతం. టెంట్ వేసి మత్స్యకారులు ఆందోళన చేస్తున్న ప్రదేశంలో ఎల్ షేపులోనే గతంలో పెద్ద కాలువ ఉండేది. దానిని పూడ్చి వేశారు. ఇక్కడ ఉన్న ఇసుక దిబ్బల నుంచి వందలాది ట్రక్కుల ఇసుకను తరలించారు. ఈ ప్రభుత్వభూమి తనదని వెంకట్రావు చెబుతున్నారు.

సముద్ర స్నానాల్లో పర్యాటకులు అప్రమత్తంగా ఉండాలి

డ్రోన్ల సాయంతో వాడరేవు, రామాపురం సముద్ర తీరంలో పోలీసుల పర్యవేక్షణ

ప్రజాశక్తి - చీరాల

సముద్ర తీరంలో సేద తీరేందుకు వచ్చే పర్యాటకులు సముద్ర స్నానాల సమయంలో అప్రమత్తంగా ఉంటూ లోతుకు వెళ్ళి అలల తాకిడికి గురికాకుండా సురక్షితంగా గమ్య స్థానాలు చేరుకోవాలని ఈపురుపాలెం ఎస్ఐ చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం సెలవు కావడంతో పర్యాటక ప్రాంతాలుగా ఉన్న ఓడరేవు, రామాపురం బీచ్‌లకు సందర్శకుల రద్దీ గణనీయంగా పెరిగుతున్న నేపథ్యంలో పోలీసులు పర్యాటకులను డ్రోన్ కెమెరాతో పర్యవేక్షించారు. ఎప్పటికప్పుడు అప్రమత్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యాటకుల రక్షణ కోసం ఈపురుపాలెం పోలీసు స్టేషన్ నుండి సిబ్బందిని బీచ్‌ల వద్ద బందోబస్తు నిమిత్తం నియమించి డ్రోన్‌ల ద్వారా సముద్రతీర ప్రాంతంపై నిఘా పెట్టామని తెలిపారు. పోలీసు సూచనలు పట్టించుకోకుండా కొంత మంది పర్యాటకులు సముద్రంలో లోతుగా వెళ్లడంవల్ల ప్రమాదకర పరిస్థితులు ఎదురవుతున్నాయని అన్నారు. ప్రస్తుతం సముద్రంలో అలలు తీవ్రంగా ఉండటాన్ని గమనించి, పర్యాటకులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, సురక్షితంగా తమ గమ్య స్థానాలకు చేరాలని అంటున్నారు. పర్యాటకులు సముద్రంలో మునిగే సందర్భంలో తల్లి, దండ్రులు పిల్లలను గమనించడంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సముద్ర తీరానికి వచ్చే ప్రతీ ఒక్కరూ సముద్ర స్నానాల సమయంలో అలల తీవ్రత ఉండే లోతుకు వెళ్లకుండా భద్రతా నిబంధనలు పాటించాలని కోరారు.



వాడరేవులో డ్రోన్ల సాయంతో పర్యాటకులను అప్రమత్తం చేస్తున్న పోలీసులు

యూనియన్లు లేకుండా చేసేందుకు కుట్ర

సిఐటియు జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

కార్పొరేట్ సంస్థలు, కేంద్ర ప్రభుత్వం యూనియన్లు లేకుండా చేసేందుకు కుట్ర పన్నుతున్నట్లు సిఐటియు జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు తెలిపారు. మండల పరిధిలోని ఉప్పుగుండూరులో వివిధ రంగాల్లో పనిచేస్తున్న కార్మికులతో మండల స్థాయి సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం రద్దుచేసి కార్పొరేట్స్ సంస్థలకు అనుకూలంగా తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్స్‌తో కార్మికులకు నష్టం వాటిల్లితుందని కేంద్రప్రభుత్వం బ్రిటీష్ కాలం నుంచి పోరాడి సాధించుకున్న కార్మికుల హక్కులను కాలరాస్తూ కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా



మాట్లాడుతున్న కాలం సుబ్బారావు

వ్యవహరించడం దుర్మార్గమని తెలిపారు. లేబర్ కోడ్స్‌ను అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాలపై కేంద్ర ప్రభుత్వం ఒత్తిడి తెస్తున్నట్లు తెలిపారు. లేబర్ కోడ్స్ అమలు చేస్తే యూనియన్ ఏర్పాటు కఠినతరం అతుందన్నారు. యూనియన్స్ లేకుండా చూడాలని కార్పొరేట్ సంస్థలు, ప్రభుత్వం భావిస్తున్నాయని విమర్శించారు యూనియన్ ఉంటేనే కార్మికులను ఇబ్బందులు పెడుతున్న యాజమాన్యాలు యూనియన్ లేకుంటే ఎలా వ్యవహరిస్తాయో ఊహించు కోవచ్చునని తెలిపారు. లేబర్ కోడ్స్‌ను రద్దుచేసి పాత చట్టాలను అమలు చేయాలని, ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటు పరం చేయరాదని, నిత్యావసర సరుకుల ధరలు తగ్గించాలనే డిమాండ్లతో జులై 9న నిర్వహిస్తున్న దేశవ్యాప్త సమ్మెలో కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్ష కార్యదర్శులు నలతోటి రామారావు, జి. బసవపున్నయ్య, చిరంజీవి, కౌలు రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి టి. శ్రీకాంత్, వివిధ రంగాల కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలి

సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు జివి. కొండారెడ్డి

ప్రజాశక్తి-మార్కాపురం

కార్మిక వ్యతిరేక కోడ్‌లను రద్దు చేయాలని, కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ వచ్చే నెల 9న నిర్వహిస్తున్న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు జివి.కొండారెడ్డి విజ్ఞప్తి చేశారు. సిఐటియు మార్కాపురం ప్రాంతీయ మండలాల సమావేశం స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో కె.సుబ్బరాయుడు అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కొండారెడ్డి మాట్లాడుతూ కార్మిక చట్టాలను కాలరాసే లేబర్‌కోడ్స్ వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పని గంటల పెంపును వ్యతిరేకించారు. యాజమాన్యాలకు సంపద సృష్టించాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పని గంటలను 8 నుంచి 10 గంటల పెంపునకు పూనుకున్నదని ఆయన విమర్శించారు. కార్మికులకు కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలని డిమాండ్ చేశారు. స్కీం వర్కర్లుగా పనిచేస్తున్న అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజనం, ఐకెపి విఒఎ, మెప్మా ఆర్‌పి, స్కూల్ శానిటేషన్



మాట్లాడుతున్న జివి. కొండారెడ్డి

కార్మికులు చాలీచాలని వేతనాలతో దుర్భర జీవితాన్ని సాగిస్తున్నారన్నారు. అలాంటి వారిని కార్మికులుగా గుర్తించి కనీస వేతనం చట్టాన్ని అమలు చేయాలని కోరారు. స్కీం వర్కర్లందరినీ రెగ్యులర్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్కీం వర్కర్లకు, కాంట్రాక్ట్ ట్‌సోర్సింగ్ కార్మికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ అమలు చేస్తామని కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇచ్చి, రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. స్వాతంత్ర్య కాలం నుంచి జాతి సంపదగా ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలను కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరణ పేరుతో కార్పొరేట్లకు కట్టబెట్టే విధానం మానుకోవాలన్నారు. పెరిగిన నిత్యావసర ధరలను వెంటనే తగ్గించాలని కోరారు. జులై 9న నిర్వహిస్తున్న దేశవ్యాప్త సమ్మెలో కార్మిక వర్గం పాల్గొనాలని కోరారు. మండల కేంద్రాల్లో మహార్యాలీల్లో అన్ని రంగాల కార్మికులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. అనంతరం సిఐటియు జిల్లా కార్యదర్శి డికెఎం.రఫీ, పట్టణ కార్యదర్శి పి.రూబెన్, మండల నాయకులు జె.నాగరాజు, ఎం.లక్ష్మి తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జెడ్.సిపోరా, ఆదిలక్ష్మి, అరుణ్‌కుమార్, కాశయ్య, రామిరెడ్డి, షేక్ మహబూబ్ బాషా, రామయ్య, సాంబ పాల్గొన్నారు.



నక్రా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న విశ్రాంత ఉద్యోగులు

విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి -మద్దిపాడు : విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కషి చేస్తానని ఆ సంఘం జిల్లా కార్యదర్శి కె.సుబ్బారావు తెలిపారు. మద్దిపాడులో విశ్రాంత ఉద్యోగుల సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగుల డిఎ, పిఆర్‌సి ఇవ్వాలని కోరారు. ఇహెచ్ఎస్ ద్వారా వైద్య సేవలు వినియోగించుకోనేలా అవకాశం కల్పించాలని కోరారు. విశ్రాంత ఉద్యోగుల మండల అధ్యక్షుడు డి.యలమంద, ప్రధాన కార్యదర్శి ఎన్. సత్యనారాయణ నివేదికను వినిపించారు. తొలుత విశ్రాంత ఉద్యోగుల సంఘం పితామహుడు నక్రా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. కోశాధికారి గంటా కోటేశ్వరరావు భోజన సదుపాయం కల్పించారు. ఈ కార్యక్రమంలో రామకోటేశ్వరరావు, ప్రభాకర్‌రావు, డి.వెంకటేశ్వర్లు, జి. నరసింహారావు పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి

సిఐటియు జిల్లా మాజీ నాయకులు సయ్యద్ హనీఫ్

ప్రజాశక్తి - పామూరు

జులై 9న నిర్వహిస్తున్న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా మాజీ నాయకులు సయ్యద్ హనీఫ్, వ్యవసాయ కార్మిక సంఘం సీనియర్ నాయకులు జాలా అంజయ్య పిలుపునిచ్చారు. పప్పు వెంకోబ్ రావు మీటింగ్ హాల్‌లో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో షేక్ ఖాదర్ అధ్యక్షతన ఆదివారం సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా హనీఫ్ మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మికుల చట్టాలను లేబర్ కోడ్ పేరుతో మార్పు చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. పని గంటలను పెంచి శ్రామికుల దోపిడీ చేసేందుకు కుట్రలు పన్నుతున్నట్లు తెలిపారు. నిత్యావసరాల ధరలు విచ్చలవిడిగా పెంచి ప్రజలపై భారాలుమోపుతుందని విమర్శించారు. కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలను రద్దు చేస్తే, కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వాన్ని కూల్చే వరకూ కార్మికుల ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. సోమవారం నుంచి సమ్మె నోటీసులను అందజేయాలని కార్మిక సంఘాలకు సంఘాలకు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో కె.మాల్యాద్రి, వై.వీరనారాయణ, సుభాని, కె.శంకర్, సిహెచ్.వెంకటేశ్వర్లు, రాజ్యం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సయ్యద్ హనీఫ్



పుస్తకాలు అందజేస్తున్న థామస్

పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి చీమకుర్తి

మండల పరిధిలోని గోనుగుంట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మక్కెన మరియా రోజి ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాత పుస్తకాలు, విద్యా సామగ్రి ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు థామస్‌మాట్లాడుతూ తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పుస్తకాలు, విద్యా సామగ్రి అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ వ్యవస్థాపకులు థామస్ను గోనుగుంట క్లస్టర్ చైర్మన్ బండి శ్రీనివాసరావు, ఎన్‌జిఒ సీనియర్ నాయకులు రవిశంకర్, ప్రధానోపాధ్యాయుడు పిజశ్రీనివాసరావు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు ఎం. రమణయ్య, విద్యా కమిటీ చైర్మన్ షేక్ అఖిల, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఇఒలు

పాఠశాలలో తనిఖీ

ప్రజాశక్తి - చీమకుర్తి

రాష్ట్ర ప్రభుత్వం సూచించిన మెనూ పాఠశాలలో తప్పనిసరిగా అమలు చేయాలని ఎంఇఒలు నరసింహారావు, శివాజీ తెలిపారు. మండల పరిధిలోని పాటిమీద పాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఆదివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల నిర్వహణ, విద్యార్థుల సామర్థ్యం, నూతన అడ్మిషన్లు, ఉపాధ్యాయుల పనితీరును పరిశీలించారు. మధ్యాహ్న భోజనం తయారీని పరిశీలించి మెనూ నిర్వాహణపై పలు సూచనలు చేశారు. విద్యార్థులందరూ తప్పనిసరిగా యూనిఫాం ధరించేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. బడి బయట పిల్లలు లను గుర్తించి పాఠశాలల్లో చేర్పించే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్.కె శిలార్, ఉపాధ్యాయులు వి.కవిత, ఆర్ఎన్.శివ. కుమారి, ఎం. విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు



రమేష్‌ను పరామర్శిస్తున్న నాయకులు

రమేష్‌కు పరామర్శ

ప్రజాశక్తి-కొండపి

మండల పరిధిలోని చవటపాలెం గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న వేముల రమేష్‌ను ఇంటలెక్చువల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ బత్తుల అశోక్ కుమార్ రెడ్డి ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా రమేష్ ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాని ఆయన ఆకాంక్షించారు. రమేష్‌ను పరామర్శించిన స్టేట్ ఎస్‌టి వింగ్ జోనల్ ప్రెతసిడెంట్ రావూరి ప్రభావతి, ఎస్‌సి సెల్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి చుక్కా కిరణ్ కుమార్, ఎస్‌సి సెల్ మండల అధ్యక్షుడు నల్లపు విజయరామ రాజు, ముప్పవరం వెంకట్రావు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పిద్దాం

ప్రభుత్వ బడులను బలోపేతం చేద్దాం : యుటిఎఫ్ పిలుపు



మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నక్క వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - బాపట్ల

ప్రభుత్వ పాఠశాలల్లో బడి ఈడు పిల్లల్ని చేర్పించే బాధ్యత ప్రభుత్వ ఉపాధ్యాయులు తీసుకోవాలని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్ వెంకటేశ్వర్లు కోరారు. ప్రజా సంఘాల జిల్లా కార్యాలయంలో ఆదివారం జరిగిన యుటిఎఫ్ జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. సమాజంలో నైతిక విలువలు, రాజ్యాంగ విలువలు కాపాడాలంటే ప్రభుత్వ విద్యా రంగం బలోపేతం కావాలని కోరారు. ప్రభుత్వ విద్యా రంగం బలోపేతం కావడానికి ఆ రంగంలో పనిచేసే ఉపాధ్యాయులే ప్రధాన భూమిక నిర్వహించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాల కంటే ప్రైవేటు పాఠశాలల్లోని విద్యార్థుల సంఖ్య పెరగటం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. అన్ని రకాల సదుపాయాలున్న ప్రభుత్వ బడుల్లో నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయులు ఉన్న పాఠశాలల్లో చేర్పించేందుకు ప్రత్యేక ప్రచార కార్యక్రమం నిర్వహించాలని చెప్పారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు జడ వినయ్ కుమార్ మాట్లాడుతూ బదిలీల చట్టం ద్వారా జరిగిన బదిలీలు, ప్రమోషన్లలో ఉన్న అసంబద్ధాలను సరిజేయడానికి యుటిఎఫ్ అన్ని సంఘాలను కలుపుకొని పెద్ద ఎత్తున పోరాటం చేసిందని అన్నారు. తద్వారా మెజారిటీ ఉపాధ్యాయులకు న్యాయం చేయగలిగామని అన్నారు. బదిలీలు, ప్రమోషన్లలో క్యాడర్ స్ట్రెంత్, పొజిషన్ ఐడిలు, డిడిఒ కోడ్స్ త్వరితగతిన పూర్తి చేసి ఉపాధ్యాయుల సమస్యలు, జీతాల పరిష్కారం చేయాలని పాఠశాలలు అభివృద్ధి చెందాలని అన్నారు. తద్వారా సమాజంలో బాధ్యత గల పౌరులు తయారవుతారని ఆకాంక్ష వ్యక్తం చేశారు. ప్రభుత్వ విద్య పట్ల సమాజానికి, తల్లి, దండ్రులకు నమ్మకం కలిగించే విధంగా ఉపాధ్యాయులు తమ పని పద్ధతులను అభివృద్ధి చేసుకోవాలని కోరారు. పాఠశాలకు వచ్చే ప్రతి విద్యార్థికి నాలుగు మంచి మాటలు, నాలుగు అక్షరాలు నేర్పాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధ్యాయులు జులై మొదటి వారంలో పిల్లలను ప్రభుత్వ కోరారు. యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి అడుగుల శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యారంగ వికాసం, ఉపాధ్యాయుల సంక్షేమం కోసం పనిచేసే సంఘం ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ అని అన్నారు. ఉపాధ్యాయులు యుటిఎఫ్‌లో సభ్యులుగా చేరాలని కోరారు. బదిలీలు, ప్రమోషన్ల సందర్భంగా ఉపాధ్యాయులకు ఎదురైన ప్రతి సమస్య చిత్త శుద్ధితో కృషిచేసి పరిష్కరించామని అన్నారు. భవిష్యత్తులో ఉపాధ్యాయుల సంక్షేమం కోసం, ప్రభుత్వ పాఠశాలల బలోపేతం కోసం కృషి చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ఊరి బడిలో పిల్లల్ని చేర్పిద్దామనే గోడప్రతిని ఆవిష్కరించారు. సమావేశంలో గౌరవాధ్యక్షులు పాపారావు, సహాధ్యక్షులు బండి బిక్షాలు బాబు, హరిప్రియ, కోశాధికారి ఎం వెంకటేశ్వరరెడ్డి, జిల్లా కార్యదర్శులు, రాష్ట్ర కౌన్సిలర్, ఆడిట్ కమిటీ సభ్యులు, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.



విద్యా ప్రచార గోడ ప్రతులను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయ నాయకులు



విద్యార్థి తండ్రికి నగదు అందిస్తున్న నిర్వాహకులు

ఇంజినీరింగ్ విద్యలో ప్రతిభకు ప్రోత్సాహకం

ప్రజాశక్తి - బాపట్ల

భీమవరం శ్రీవిష్ణు ఉమెన్స్ ఇంజినీరింగ్ కళాశాలలో 4వ సంవత్సరం ఇంజినీరింగ్ విద్యలో అత్యంత ప్రతిభ కనబరిచిన బాపట్లకు చెందిన విద్యార్థిని సజ్జా నందుభవానికి స్థానిక వ్యవసాయ కళాశాల పూర్వ విద్యార్థిని ముత్తవరపు హిమబిందు (ఆస్ట్రేలియా) రూ.50వేలు ఆర్థిక ప్రోత్సాహకం ఆదివారం అందజేశారు. బాపట్ల వ్యవసాయ కళాశాలలో మానవతా స్వచ్ఛంద సేవ సంస్థ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నగదు ప్రోత్సాహకాన్ని బాలిక తండ్రికి డిఇఒ ఎస్ పురుషోత్తం అందచేశారు. ఈ సందర్భంగా డిఇఒ పురుషోత్తం మాట్లాడుతూ విద్యలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు స్వచ్ఛందంగా ప్రతి ఒక్కరు ఉన్నత చదువులకు అనేక విధాలుగా సహాయ సహకారాలు అందిస్తారని అన్నారు. కార్యక్రమంలో మానవతా సంస్థ చైర్మన్ బి శరత్ బోస్, గౌరవ అధ్యక్షులు వంకాయలపాటి హరిబాబు, అధ్యక్షులు పంగులూరి హరిప్రసాద్, ఉపాధ్యక్షులు అల్లాడి రవికుమార్, సంయుక్త కార్యదర్శి ఎం సూరిబాబు, కోశాధికారి సిహెచ్ కేశవులు, సంస్థ సలహాదారులు జి శాంతారాం, సిహెచ్ సత్యన్నారాయణ, కె విజయ్ కుమార్, ఎం ప్రసన్న ఆంజనేయులు, ఎల్ వెంకట్రావు, టి రామాంజనేయులు, మాజీ సైనిక సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు తాండ్ర సాంబశివరావు పాల్గొన్నారు.

నేడు పొగాకు కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

ప్రజాశక్తి - పంగులూరు

పంగులూరులోని మార్కెట్ యార్డులో బర్లీ పొగాకు కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించేందుకు విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, జిల్లా ఇన్చార్జి మంత్రి కొలుసు పార్థసారథి, పర్చూరు శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావు సోమవారం పంగులూరు వస్తున్నట్లు తెలుగుదేశం నాయకులు కుక్కపల్లి ఏడుకొండలు ఆదివారం తెలిపారు. సోమవారం ఉదయం 10 గంటలకు బర్లీపొగాకు కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తారని తెలిపారు. రైతుల వద్ద నిల్వ ఉన్న చివరి ఆకు వరకు కొనుగోలు చేస్తారని తెలిపారు. రైతులు అధైర్య పడాల్సిన పనిలేదని తెలిపారు. పొగాకు రైతులు రైతు సేవా కేంద్రాల్లో సిఎం యాప్‌లో సాగుచేసిన నల్లబర్లీ పొగాకు దిగుబడి, రైతు వివరాలు నమోదు చేసుకోవాలని తెలిపారు. మార్క్‌ఫెడ్ నిబంధనల ప్రకారం తేమశాతం20కన్నా తక్కువ ఉండే విధంగా చూసుకుని కొనుగోలు కేంద్రానికి తీసుకెళ్లాలని తెలిపారు. కార్యక్రమంలో బర్లి పొగాకు రైతులు, తెలుగుదేశం కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

పర్చూరు : పర్చూరు, అద్దంకి నియోజకవర్గాల్లో బర్లీ పొగాకు రైతుల కోసం ఏర్పాటు చేసిన పొగాకు కొనుగోలు కేంద్రాలను మంత్రులు కొలుసు పార్థసారథి, గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు కలిసి సోమవారం ప్రారంభించనున్నారు. ఉదయం 10 గంటలకు పంగులూరు యార్డులో బర్లీ పొగాకు కొనుగోలు కేంద్రం, 11:30 గంటలకు ఇంకొల్లు మార్కెట్ యార్డులో బర్లీ కొనుగోలు కేంద్రం ప్రారంభించనున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం1.30 గంటలకు పర్చూరు స్టేట్ వేర్హౌస్ కార్పొరేషన్ గోదాములో ఏర్పాటు చేసిన పొగాకు కొనుగోలు కేంద్రాన్ని సందర్శిస్తారు. పొగాకు కొనుగోలు తీరును పరిశీలించి రైతులతో మాట్లాడుతారు.

ఇంకొల్లు : నేడు పర్చూరు, అద్దంకి నియోజకవర్గాల్లో మూడు పొగాకు కొనుగోలు కేంద్రాలు ప్రారంభించనున్నట్లు శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావు ఆదివారం తెలిపారు. జిల్లా ఇంచార్జి మంత్రి కొలుసు పార్థసారథి, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, కలెక్టర్ వెంకట మురళి పాల్గొన్నట్లు తెలిపారు.

అక్షరాలు దిద్దిన పాఠశాల్లోనే ఉపాధ్యాయురాలిగా..

గురువులతో కలిసి పనిచేసిన రమాదేవి

ప్రజాశక్తి - పంగులూరు

తాను మొదటిగా అక్షరాలు దిద్దిన పాఠశాల్లోనే ఉపాధ్యాయురాలుగా, తనకు చదువు నేర్పిన గురువులతోనే కలిసి సహధ్యాయురాలుగా పనిచేయటం తన జీవితంలో మరిచిపోలేని అనుభవమని ఉద్యోగ విరమణ పొందుతున్న జెడ్‌పి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కొప్పోలు రమాదేవి పేర్కొన్నారు. 39ఏళ్ల ఉద్యోగ జీవితంలో ఎంతో మందిని ఉన్నత స్థాయిలోకి వెళ్లేందుకు ఉపయోగపడ్డానని సంతృప్తి వ్యక్తం చేశారు. తను, తన కుటుంబం ఎంతో మంది జీవితాలకు వెలుగునిచ్చామని చెప్పారు. కొరిశపాడు మండలం దైవాలు రావూరు గ్రామంలో కొప్పోలు విగ్నేష్, లక్ష్మీదేవిలకు 1963 జూన్ 16న జన్మించారు. ప్రాథమిక విద్య దైవాలు రావూరు, ఉన్నత విద్య రావినూతల హైస్కూల్లో, డిగ్రీ ఒంగోలు మంగమ్మ కాలేజీలో, బీఈడీ బందర్ పద్మావతి మహిళా కాలేజీలో చదివారు. 1986 జూన్‌లో ఉద్యోగంలో



హెచ్ఎం కొప్పోలు రమాదేవి

ప్రవేశించి కనిగిరి మండలం వెంకటేశ్వరపురంలో పని చేశారు. తరువాత స్వగ్రామమైన దైవాలరావూరులో తాను అక్షరాలు దిద్దిన పాఠశాల్లోనే ఉపాధ్యాయురాలుగా పని చేశారు. చిన్నప్పుడు ఆ పాఠశాల్లో తనకు చదువు చెప్పిన ఉపాధ్యాయులతో కలిసి పని చేశారు. ఇది తన జీవితంలో మరవిపోలేని అనుభూతనీ, తన జీవితాంతం గుర్తుండిపోయే ఎన్నో అనుభూతులను తెలుసుకున్నానని తెలిపారు. తరువాత ఇంకొల్లు మండలం సూదివారిపాలెం, పంగులూరు మండలం తూర్పు తక్కెలపాడు, ఇంకొల్లు మండలం వంకాయలపాడు, కొరిశపాడు మండలం దైవాల రావూరు హై స్కూలు, సోమవరప్పాడు, నాగులుప్పలపాడు మండలం వినోద్ రాయునిపాలెంలో పనిచేసి 2021 అక్టోబర్ నుండి పంగులూరు జిల్లా పరిషత్ హై స్కూలు ప్రధానోపాధ్యాయులుగా పని చేస్తున్నారు. ఈ 39ఏళ్లలో ఎంతో మంది తన విద్యార్థులు బ్యాంకు ఉద్యోగులుగా, డాక్టర్లుగా అనేక స్థాయిలో పనిచేస్తున్నారని అన్నారు. దైవాలరావూరులో 18ఏళ్లు పనిచేసానని తెలిపారు. అక్కడ పాఠశాలలో 90 మంది పిల్లలు ఉండే వారిని, తను వెళ్ళిన తర్వాత ఉపాధ్యాయుల సహకారంతో ఆ సంఖ్యను 150 వరకు పెంచామన్నారు. అక్కడ పిల్లలను చదువు పట్ల ఆసక్తి కలిగే విధంగా ప్రోత్సహించి, విద్యావంతులను చేసామన్నారు. పిల్లలకు చదువు చెప్పటంలో ఉపాధ్యాయులకు ఒత్తిడి లేకుండా స్వేచ్ఛనిచ్చాననీ, అందువల్లనే మంచి ఫలితాలు సాధించామని అన్నారు. పంగులూరు హైస్కూల్లో 10వ తరగతిలో 580 మార్కులు అనేక మంది విద్యార్థులు సాధించారని, సైన్స్ క్విజ్ స్టేట్ కాంపిటేషన్‌కు తమ విద్యార్థులు అర్హత సాధించారని, అకాడమిక్ అవార్డులు సాధించి, కలెక్టర్ చేత అవార్డులు పొందామని చెప్పారు. ఉద్యోగ విరమణ చేసిన తర్వాత ఆధ్యాత్మిక సేవలో ఉంటానని, పేద పిల్లలకు చదువు కోసం తన వంతు కృషిని కొనసాగిస్తానని అన్నారు.

కాలువల్లో పేరుకున్న మురుగు

ప్రజాశక్తి - పంగులూరు

మండలంలోని తూర్పు తక్కెళ్ళపాడు గ్రామంలోని సైడ్ కాలవల్లో మురుగు పేరుకుపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని గ్రామస్తులు తెలిపారు. స్థానిక ఎన్టీఆర్ విగ్రహం దగ్గర కాలవలో చెత్త, చెదారం, ప్లాస్టిక్ గ్లాసులు, ప్లాస్టిక్ కవర్లు వంటివి మురుగు కాలువలో నిలిచిపోయి దుర్వాసన వస్తుందని తెలిపారు. దీనివలన దోమలు చేరి ప్రజలను ఇబ్బంది పెడుతున్నాయని చెబుతున్నారు. గ్రామంలో మురుగునీటి కాలువల దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నట్లు గ్రాస్తులు చెబుతున్నారు. వర్షాల సీజన్లో వర్షపు నీరు వెళ్లడానికి కాలువల్లో పేరుకున్న చెత్త అడ్డుపడి నీళ్ళ వెళ్లక రోజుల తరబడి నిలిచి దోమలు పెరుగుతున్నాయని గ్రాస్తులు పేర్కొన్నారు. దోమలతో విషజ్వరాలు వ్యాపిస్తున్నాయని చెబుతున్నారు. గత కొన్ని రోజులుగా పంచాయతీ అధికారికి తెలియజేసిన పరిష్కారం చేయలేదని తెలిపారు. ఈ విషయమై



తూర్పు తక్కెళ్ళపాడులో కాలువల్లో పేరుకున్న మురుగు

పంచాయతీ సర్పంచ్ మేడూరి అంజయ్యను ప్రజాశక్తి వివరణ కోరగా పంచాయతీలో డబ్బు లేదని, ఈపాటికే తాను రూ.4లక్షలతో పనులు చేసినప్పటికీ బిల్లులు రాలేదని అన్నారు. కాలువల్లో చెత్త, మురుగు తొలగించాలని, పంచాయతీలో పన్ను సరిగా వసూలు కావట్లేదని, డబ్బు వచ్చిన వెంటనే సమస్య పరిష్కరిస్తామని తెలిపారు.



పోలీసుల అదుపులో పేకాట రాయుళ్ళు

పేకాట స్థావరాలపై పోలీసుల దాడి

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మండలంలోని గొరిగిపూడి పంచాయతీ పరిధిలోని వరికుటివారిపాలెంలో జరుగుతున్న పేకాట స్థావరంపై భట్టిప్రోలు ఎస్ఐ ఎం శివయ్య ఆధ్వర్యంలో పోలీసులు ఆదివారం దాడులు నిర్వహించారు. ఈ దాడిలో 12 మంది జూదరులను అదుపులోకి తీసుకొని వారి నుండి రూ.20300 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసి కోర్టులో సోమవారం హాజరు పర్చనున్నట్లు చెప్పారు. మండలంలో కోడిపందాలు, పేకాట స్థావరాలు ఏర్పాటు చేసి నిర్వహిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ అనిల్ నాగరాజు, పోలీసు సిబ్బంది ఉన్నారు.

రహదారులు ఇలా.. నిర్మాణాలు ఎలా..?



బేస్ మెట్ కే పరిమితమైన గృహాలు

ప్రజాశక్తి - భట్టిప్రోలు

పీఎంఎవై ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకం కింద కాలనీలలో గృహాలు నిర్మించుకునేందుకు కనీస వసతులైన రహదారులు, నీటి వసతి లేకుండా నిర్మాణాలు ఏ విధంగా చేపట్టాలంటూ లబ్ధిదారుల ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వ పాలనలో నిరుపేదలకు నివేశన స్థలాల కొరకు కేటాయించిన కాలనీల్లో ప్రస్తుతం ఎలాంటి వసతులు లేవు. గత ప్రభుత్వం కేటాయించిన స్థలాలకు అప్పట్లోనే విద్యుత్ సౌకర్యం కొంత మేర ఏర్పాటు చేశారు. అక్కడక్కడ నీటి వసతులు కల్పించారు. అది తప్ప ప్రస్తుత కూటమి ప్రభుత్వ పాలనలో కాలనీలో ఎలాంటి మౌళిక వసతులు ఏర్పాటు చేయలేదు. కానీ లబ్ధిదారులు తప్పనిసరిగా గృహాలు నిర్మించుకోవాలని వారిపై అధికారులు మాత్రం ఒత్తిడిలు తీవ్రమయ్యాయి. మండల కేంద్రం భట్టిప్రోలులో లబ్ధిదారులకు కేటాయించిన స్థలాలు పూర్తిగా పల్లపు ప్రాంతం. ఈ ప్రాంతం వర్షాకాలంలో సుమారు 3అడుగుల మేర నీరు నిలబడి కాలనీలోకి రాకపోకలు నిలిచిపోతాయి. ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభమైన దృష్ట్యా కనీస రహదారులు కూడా లేని ఈ కాలనీలో గృహ నిర్మాణానికి అవసరమైన సామాన్లు తరలించుకోవడానికి కూడా అవకాశం లేదని, ఇలాంటి పరిస్థితుల్లో గృహాలు ఏ విధంగా నిర్మాణాలు చేపట్టాలని లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాలనీలో కనీసం ప్రధాన రహదారినైనా అభివృద్ధి పరిస్తే కొంతమేర గృహ నిర్మాణాలకు అవకాశం కలుగుతుందని చెబుతున్నారు. ఉన్న ప్రధాన రహదారి కూడా చివరి వరకు రాకపోకలు కొనసాగించే పరిస్థితి లేదు. ఈ కాలనీలో నిర్మించిన పైప్ లైన్ కూడా సకాలంలో నీరు అందక, అక్కడక్కడ పైపులు లీకై నీరు రహదారిపై చేరి మెటీరియల్ తరలించుకోవడానికి వాహనాలు వచ్చే పరిస్థితి లేక అవస్థలు పడుతున్నామని వాపోతున్నారు.

గృహ నిర్మాణాలకు ఎస్సీ, ఎస్టీలు దూరం

ఈ గ్రామంలో మూడు లేఔట్ల ద్వారా లబ్ధిదారులకు నివేశన స్థలాలు కేటాయించారు. వీటిలో చివరి రెండు లే అవుట్లలో గృహాలు నిర్మించుకునేందుకు ఎలాంటి వస్తువులు లేవు. ఆ రెండు లే ఔట్లకు వెళ్ళటానికి కనీసం రోడ్డు మార్గం కూడా లేక గృహ నిర్మాణాలు చేపట్టేందుకు లబ్దిదారులు ముందుకు రావడం లేదు. 2వ లే ఔట్ పూర్తిగా ఎస్టిలకు కేటాయించబడింది. ప్రభుత్వం ఎస్టీలకు రూ.70వేలు అదనంగా పెంచినప్పటికీ గృహ నిర్మాణాలు చేపట్టడానికి అవకాశం లేకపోవడంతో లబ్దిదారులు ముందుకు రావడం లేదు. నిరుపేదలైన గిరిజన కుటుంబాలకు నివేశన స్థలాలు ఎక్కడో దూరాన కేటాయించారని, ఆనాటి రాజకీయ నాయకులు వారి పలుకుబడులతో ఎంతో కొంత కలిగిన వారికి మొదటి లేఔట్‌లో స్థలాలు కేటాయించడంతో కొంతమేర నిర్మాణాలు చేపట్టగలిగారని, గత ప్రభుత్వం కంటే కూటమి ప్రభుత్వంలో రూ.70 వేలు అదనంగా పెంచడం అభినందనీయం అయినప్పటికీ మెటీరియల్ తరలించే కనీస రహదారి లేకపోవడం వలన ఏమి చేయాలో దిక్కు తోచడం లేదని గిరిజన లబ్ధిదారులు వాపోతున్నారు. ప్రస్తుతం రహదారుల వెంట కాలువకట్లపై, అద్దె గృహాల్లో నివాసం ఉంటున్న తమకు సొంతగృహం నిర్మించుకోవాలని ఆశగా ఉందని, కానీ అందుకు అవసరమైన సౌకర్యాలు లేకపోవడంతో సొంత గృహానికి దూరమవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి తరుణంలో ప్రభుత్వం చొరవ చూపి పీఎంఈవై ఎన్టీఆర్ కాలనీలో ప్రధాన రహదారి ఏర్పాటు చేసి లబ్ధిదారులకు అవసరమైన నీటి వసతులు కల్పిస్తే గృహాలు నిర్మించుకుంటామని లబ్ధిదారులు కోరుతున్నారు.



చిత్రమైన కాలనీ రహదారులు



ఎన్నికైన పట్టణ శాఖ నూతన కార్యవర్గం

ఎస్‌టియు పట్టణ కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - బాపట్ల

రాష్ట్రోపాధ్యాయ సంఘం పట్టణ శాఖ నూతన కార్యవర్గం ఎన్నిక ఆదివారం ఎస్‌టియు కార్యాలయంలో నిర్వహించారు. పట్టణ కన్వీనర్ గాలి ముక్తేశ్వరరావు, మున్సిపల్ ప్రాథమిక పాఠశాలల కో కన్వీనర్లు షేక్ మహమ్మద్ రఫీ, షేక్ ఫజూలుద్దీన్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఎస్‌టియు జిల్లా అధ్యక్షులు బడుగు శ్రీనివాస్ మాట్లాడుతూ మున్సిపల్ ఉపాధ్యాయులకు పిఎఫ్ సౌకర్యం కల్పించాలని అన్నారు. పట్టణ ప్రాంతంలో జనావాసాలు, కాలనీలు విస్తరించిన దృష్ట్యా మున్సిపాలిటీ పరిధిలో కొత్తగా పాఠశాలలు ఏర్పాటు చేయాలని అన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి గుడివాడ అమరనాథ్ మాట్లాడుతూ మున్సిపాలిటీలో అర్బన్ ఎంఈఓ పోస్టు మంజూరు చేయాలని అన్నారు. మున్సిపాలిటీలో అప్ గ్రేడ్ అయిన ఉన్నత పాఠశాలలను క్లస్టర్ పాఠశాలలుగా మార్చాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రాష్ట్ర కౌన్సిలర్ గుగ్గిలం ఉదయ శంకర్, జిల్లా ఉపాధ్యాయ వాణి కన్వీనర్ పివి నాగరాజు, నూర్ భాషా సుభాని, బొంత వెంకటేశ్వర్లు, గవిని శ్రీనివాసరావు, నారాయణమూర్తి, పీలా శివాంజనేయులు, నగరం అధ్యక్షు లు టి శివయ్య, విహెచ్ శ్రీనివాసరావు, ఎవి నారాయణ, బాలకృష్ణ, యడం కోటేశ్వరరావు, కె బుజ్జి బాబు పాల్గొన్నారు.

లారీని ఢీ కొట్టిన మరోలారీ

ప్రజాశక్తి - అద్దంకి



వెనుకనుండి ఢీ కొట్టిన లారీ

ముందు వెళ్తున్న లారీని వెనుక నుంచి మరో లారీ ఢీ కొట్టిన ఘటనలో డ్రైవర్, క్లీనర్‌కు రక్త గాయాలైన ఘటన ఆదివారం అర్ధరాత్రి మండలంలోని చక్రాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలో జరిగింది. గాయపడ్డ పల్నాడు జిల్లా రాజుపాలెం మండలం కొత్తూరు గ్రామానికి చెందిన డ్రైవర్ పి శ్రీను, క్లీనర్ బి లక్ష్మీనారాయణను వెంటనే 108 వాహనంలో ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పశు వైద్యశాలలో వసతులు ఏవీ?



నిరుపయోగంగా ఉన్న యద్దనపూడి పశువైద్యశాల

ప్రజాశక్తి - యద్దనపూడి

స్థానిక పశు వైద్యశాల వసతులు లేవు. దీంతో పసు పోషకులు అవస్థలు పడుతున్నారు. ఈ వైద్యశాలకు 1971లో రావుల బాపయ్య భవనాన్ని ఉచితంగా నిర్మించి ఇచ్చారు. పశువులు, పశువు పోషకులకు మెరుగైన వైద్యం అందించాలనే ఉద్దేశంతో దాతలు భవనం ఇచ్చిన ఉద్దేశం నిలబెట్టవలసిన అవసరం అధికారులపై ఉందని గ్రామ ప్రజలు అంటున్నారు. ప్రస్తుత పరిస్థితి చూస్తే దాతల ఉద్దేశం నెరవేరడం లేదు. ఆసుపత్రికి వెళ్లడానికి సరైన మార్గం లేదు. పశువులు విశ్రాంతి తీసుకోవడానికి నిర్మించిన షెడ్డు ముందు ఉన్న చేతిపంపు మరమ్మత్తులకు గురైంది. పశు వైద్యశాల ముందు అంత గడ్డి మొలిచి శిధిలావస్థకు చేరుకుంది. నిర్మానుష్యంగా ఉండటంతో పశు పోషకులు ఆసుపత్రికి గేదెలను తీసుకొచ్చేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నటువంటి కొద్ది మార్గాన్ని సరైన మట్టితో పంచాయతీ, పశువైద్య అధికారులు పట్టించుకోవడం లేదు.

చేతి పంపు రమ్మత్తులు చేయించాలి



పెరవలి శ్రీనివాసరావు, యద్దనపూడి

పశువులకు త్రాగునీటికి అవసరమైన మరమ్మతులకు గురైన చేతి పంపుకు మరమ్మతులు చేయించి అందుబాటులోకి తీసుకురావాలని గ్రామానికి చెందిన పెరవలి శ్రీనివాసరావు కోరారు. ఇన్చార్జి డాక్టర్ కాకుండా పశు వైద్యశాలకు పూర్తిస్థాయి వైద్యాధికారిని నియమించాలని కోరుతున్నాడు.

పశువైద్యుడిని నియమించాలి



నల్లపునేని లక్ష్మీనారాయణ

మండల కేంద్రంలోని పశు వైద్యశాలలో పూర్తిస్థాయి డాక్టర్ లేకపోవడం ఇబ్బందిగా ఉంటుందని గ్రామానికి చెందిన పశుపోషకులు నల్లపనేని లక్ష్మినారాయణ కోరారు. నోరులేని దేవాలయం అన్నారు. ఏదైనా అనారోగ్యం ఏర్పడితే పశు వైద్యశాలకు వస్తే అధికారి ఉండకపోవటం శోచనీయమని అన్నారు. ఎప్పటికైనా సంబంధిత అధికారులు పరిస్థితి అర్థం చేసుకొని పశువైద్య అధికారిని నియమించి, అదే విధంగా పశువులకు సబ్సిడీలో దాణా ఇవ్వాలని కోరారు.

సముద్ర తీరంలో ఒకరు మృతి..

మరొకరు గల్లంతు

ప్రజాశక్తి - చీరాల



అబ్దుల్ బారి (23)



బానుచందర్

స్నేహితులతో కలిసి సరదాగా సముద్ర స్థానానికి వచ్చిన యువకుడు తీరంలో గల్లంతై మృతి చెందిన సంఘటన ఆదివారం రామాపురం సముద్ర తీరంలో జరిగింది. హైదరాబాద్, తాడిబండ, బాదురుపేటకు చెందిన రసూల్ కుమారుడు సయ్యద్ అబ్దుల్ బారి (23) సముద్ర తీరానికి స్నేహితులతో కలిసి రామాపురం చేరుకున్నాడు. సముద్ర స్థానం చేస్తుండగా ఒక్కసారిగా అలలు ఎగిసి పడటంతో అలలు తాకిడికి గురైయ్యడు. గమనించి తోటి స్నేహితులు కాపాడే ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం లేకపోయింది. ఆ యువకుడు సముద్రంలో మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. ఘటనపై ఈపురుపాలెం ఎస్ఐ చంద్రశేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉండగా చీరాల పట్టణం వైకుంఠపురంకు చెందిన బానుచందర్ అనే యువకుడు వాడరేవులో సముద్ర స్నానం చేస్తూ గల్లంతయ్యాడు. అతని కోసం పోలీసులు గాలిస్తున్నారు.



సమావేశంలో పాల్గొన్న ఎంఎల్ఎ ఏలూరి సాంబశివరావు

సుపరిపాలన సమావేశంలో ఎమ్మెల్యే ఏలూరి

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

తెలుగుదేశం రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం జరిగిన 'సుపరిపాలనలో తొలి అడుగు - ఇంటింటికి టీడీపీ' సమావేశంలో శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఎం చంద్రబాబు నాయుడు అధ్యక్షతన దిశా నిర్దేశం చేశారు. మంత్రులు కొలుసు పార్ధసారథి, గొట్టిపాటి రవికుమార్, అనగాని సత్యప్రసాద్, తెలుగుదేశం జిల్లా అధ్యక్షులు సలగల రాజశేఖర్ బాబు, సహచర శాసన సభ్యులు ఉగ్ర నరసింహారెడ్డితో కలిసి ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు హాజరయ్యారు.



సమావేశంలో పాల్గొన్న నరేంద్ర వర్మ

బాపట్ల : తెలుగుదేశం మంగళగిరి జాతీయ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన 'సుపరిపాలనలో తొలి అడుగు - ఇంటింటికి టీడీపీ' కార్యక్రమంలో శాసన సభ్యులు వేగేసిన నరేంద్ర వర్మ పాల్గొన్నారు. సిఎం చంద్రబాబు నాయుడు అధ్యక్షతన నిర్వహించిన రాష్ట్ర విస్తృతస్థాయి సమావేశంలో ఆయనతోపాటు నియోజకవర్గ పరిశీలకులు బొంతు శివసాంబిరెడ్డి, బావుడా చైర్మన్ సలగల రాజశేఖర్ బాబు, రాష్ట్ర కార్యదర్శి తాతా జయప్రకాశ్ నారాయణ పాల్గొన్నారు.



ఆర్థిక సహాయం అందజేస్తున్న దృశ్యం

అగ్నప్రమాద బాధితులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - నగరం

మండలంలోని పీటవారిపాలెంలో ఈనెల 16న జరిగిన అగ్ని ప్రమాద బాధిత రజక కుటుంబాలకు బీసీ సంక్షేమ సంఘం, గౌడ సంక్షేమ సంఘం సంయుక్తంగా పరామర్శించి ఆర్థిక చేయూత అందించారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ అధ్యక్షులు మోర్ల వెంకట కృష్ణ మాట్లాడుతూ బీసీ, రజక సామాజిక వర్గానికి చెందిన మూడు కుటుంబాల ఇల్లు అగ్నికి ఆహుతై కట్టుబట్టలతో ప్రాణంతో బయటపడ్డారని అన్నారు. ఈ ఘటన చాలా బాధాకరమని, చాలా పేద పరిస్థితిలో నిరాశ్రయులుగా ఉన్న బాధితులకు ఆర్థిక సహాయం అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ విషయాన్ని రెవెన్యూ మంత్రి సత్యప్రసాద్ దృష్టికి తీసుకెళ్లి బాధితులకు పక్కా గృహం నిర్మాణం కోసం కృషి చేస్తామని తెలిపారు. బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర అధికార ప్రతినిధి బాదుగున్నల శ్రీను మాట్లాడుతూ బీసీల్లో ఏ సామాజిక వర్గాలకి ఇబ్బందులు కలిగినా అందరూ సమన్వయంతో ఒకరికి ఒకరు సహకరించుకుంటూ ఉండాలని కోరారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు యామా మురళి, ఉపసర్పంచ్ ధూళిపూడి సామ్రాజ్యం, కుక్కల రాంప్రసాద్, పీట తేజ, వాకా శ్రీకాంత్, విచారపు రాఘవయ్య, ధూళిపూడి శివ, ఏమినేని కోటేశ్వరావు, వాకా మోహన్ కృష్ణ, శివ పాల్గొన్నారు.

నాడు ప్రత్యక్ష ఎమర్జెన్సీ..

నేడు కనపడని ఎమర్జెన్సీ..

- నాడు రాజకీయ నియతృత్వం నేడు మతతత్వ నియంతతత్వం..
- సోషలిజం తప్ప మరో మార్గం లేదు
- 'ఎమర్జెన్సీ నాడు-నేడు' సదస్సులో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు రాంభూపాల్

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

నాడు ఇందిరాగాంధీ ప్రభుత్వం ప్రత్యక్ష ఎమర్జెన్సీ కొనసాగిస్తే నేడు అప్రకటిత ఎమర్జెన్సీ కొనసాగుతోందని సిపిఎం కార్యదర్శివర్గ సభ్యులు వి.రాంభూపాల్ విమర్శించారు. అదివారం నాడు సిపిఎం ప్రకాశం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఎమర్జెన్సీ విధించి 50 సంవత్సరాల అయిన సందర్భంగా 'ఎమర్జెన్సీ నాడు-నేడు' అనే అంశంపై జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. పార్టీ జిల్లా కార్యదర్శి ఎస్‌కె. మాబు అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో ముఖ్యఅతిథిగా రాంభూపాల్ మాట్లాడారు. 1975లో జూన్ 25 అర్ధరాత్రి నాటి ప్రధాన మంత్రి ఇందిరాగాంధీ ఎమర్జెన్సీని ప్రకటించి ప్రభుత్వాన్ని ప్రశ్నించే వారిని, ప్రతిపక్షాల నాయకులను, విద్యార్థి నాయకులను, కార్మిక నాయకులను ప్రధానంగా సీపీఎం కార్యకర్తలందరినీ మీసా చట్టం కింద అరెస్టు చేసి జైలు పాలు చేశారని ఆరోపించారు. 18 నెలల పాటు నిర్బంధం కొనసాగినట్లు ఈ సందర్భంగా గుర్తు చేశారు. రాయబరేలిలో తన గెలుపు చెల్లదని కోర్టు తీర్పు ఇచ్చిన నేపథ్యంలో పార్లమెంట్‌లో తన ఓటు హక్కును కాపాడుకునేందుకు అప్రజాస్వామిక పద్ధతిలో 356 ఆర్టికల్ ప్రయోగించి పార్లమెంట్‌లో చర్చ లేకుండా, కాబినెట్ ఆమోదం లేకుండా, రాష్ట్రపతి అనుమతి లేకుండా అర్ధరాత్రి వేళ తీవ్ర నిర్బంధం విధించినట్లు విమర్శించారు. ఎమర్జెన్సీ కాలంలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా బిజెపి పోరాడినట్లు మోడీ ప్రకటించటం పచ్చి అబద్ధమన్నారు. అప్పటి ఆర్ఎస్ఎస్ ద్వంద విధానాలు అమలు చేసినట్లు పేర్కొన్నారు. ఎమర్జెన్సీకి అనుకూలంగా వ్యవరిస్తున్నట్లు దేవరస్ 3 సార్లు లేఖలు రాసిన అంశాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఎమర్జెన్సీ కాలంలో బెంగాల్ ప్రభుత్వం సిపిఎంపై తీవ్ర నిర్బంధం విధించినట్లు ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ నిర్బంధకాండ వల్ల 1148 మంది కార్యకర్తలు హత్య గావించబడ్డారని, వేలాది మంది ఆస్తులు లూటీ అయ్యాయని పేర్కొన్నారు. ఈ కాలంలో మీసా చట్టాన్ని ప్రయోగించి 38,418 మందిని, జాతీయ భద్రతా చట్టం కింద మరో 72,316 మందిని నిర్బంధించిందని, దేశవ్యాప్తంగా 1.18 లక్షల మంది అక్రమంగా అరెస్టు అయ్యారని ఈ సందర్భంగా వివరించారు. స్వాతంత్రం వచ్చిన తరువాత ఇటువంటి నిర్బంధం మరెన్నడూ జరగలేదన్నారు. ఎమర్జెన్సీ కాలంలో ఎమర్జెన్సీని బలపరిచింది ఆర్ఎస్ఎస్ అని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఎమర్జెన్సీ పరిణామాల అనంతరం అధికారంలోకి వచ్చిన జనతా పార్టీని కూల్చింది కూడా ఆర్ఎస్ఎస్ శక్తులేనని ఆయన గుర్తు చేశారు. నాడు ఇందిరా గాంధీ తనయుడు సంజయ్‌గాంధీ రాజ్యాంగేతర శక్తిగా కొనసాగితే నేడు ఆర్ఎస్ఎస్ ఆ పాత్ర పోషిస్తోందన్నారు. నాడు ఇందిరాగాంధీ కొనసాగించిన ఎమర్జెన్సీని మించిన ఎమర్జెన్సీ నేడు మోడీ ప్రభుత్వంలో నెలకొందని విమర్శించారు. బిజెపి అధికారం చేపట్టిన 11 ఏళ్ల కాలంలో తీవ్ర నిర్బంధం కొనసాగుతోందన్నారు. బిజెపి అధికారంలోకి వచ్చిన దశాబ్ద కాలం పైగా ప్రశ్నించే వారిని, నరేంద్ర మోడీని విమర్శించిన వారిని ఉపా చట్టం కింద అరెస్ట్ చేసి ఆరు నెలలకు పైగా బెయిల్ రాకుండా నిర్బంధిస్తున్నారని ఆరోపించారు. రాజ్యాంగ హక్కులను కాలరాయడంతో పాటు రాజ్యాంగాన్నే మార్చే కుట్ర చేస్తున్నారని విమర్శించారు. నాడు ప్రత్యక్ష నియతృత్వం కొనసాగితే నేడు పరోక్షంగా నియతృత్వం కొనసాగుతోందన్నారు. భిన్న మతాల ప్రజాస్వామ్య వ్యవస్థలో మతనియంతత్వం కొనసాగాలని ఆర్ఎస్ఎస్, బిజెపి యోచిస్తున్నట్లు తెలిపారు. ఈ కారణంగా రాజ్యాంగంలోని సెక్యులరిజం, సోషలిజం పదాలు తొలగించే ప్రస్తావన తెస్తున్నట్లు ఆరోపించారు. ఈ పరిస్థితుల్లో లౌకికశక్తులు, ప్రజాతంత్రవాదులు ఐక్యమై సెక్యులరిజాన్ని కాపాడుకోవాలన్నారు. కాగా మోడీ మతతత్వ నియంతత్వాన్ని ఎదిరించడానికి సోషలిజం ఒక్కటే మార్గమన్నారు. సదస్సులో పార్టీ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.మాబు, కార్యదర్శివర్గ సభ్యులు కంకణాల ఆంజనేయులు, చీకటి శ్రీనివాసరావు, పార్టీ సీనియర్ నాయకులు వై.సిద్ధయ్య, ఏవి పుల్లారావు మాట్లాడారు. సదస్సులో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పశుగణనపై ప్రత్యేక శ్రద్ధ

- 1075 మినీ గోకులాల నిర్మాణం
- జిల్లా పశు సంవర్ధక అధికారి డాక్టర్ బి.రవి వెల్లడి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు పశుగణన కార్యక్రమంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు జిల్లా పశుసంవర్ధక అధికారి డాక్టర్ బి.రవి తెలిపారు. పేద రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీలో పశుగ్రాసం విత్తనాలు. దాణామృతం, చాప్ కట్టర్లు పంపిణీ చేశామన్నారు. జిల్లాలోని 8 నియోజకవర్గాలలో నట్టల నివారణ కార్యక్రమం చేపట్టామన్నారు. పశు కిసాన్ క్రెడిట్ కార్డుల ద్వారా 233.17 కోట్లు పశు పెంపకందార్లకు అందజేశామన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా జిల్లాలో మినీ గోకులాల నిర్మాణం, నీటి తొట్టెల నిర్మాణం చేపట్టామన్నారు. జిల్లా పశు సంవర్ధక శాఖ రైతులు, పశు పెంపకందార్లకు అందిస్తున్న పథకాలను ఏహెచ్ఒ ప్రజాశక్తికి వివరించారు. అవన్నీ ఆయన మాటల్లోనే...



ముఖాముఖి

కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా ఆదేశాల మేరకు జిల్లా పశు సంవర్ధక శాఖ ద్వారా పశు పెంపకందార్లకు అవసరమైన అన్ని చర్యలూ తీసుకుంటున్నాం. జిల్లాలో వివిధ స్థాయిలలో పశువైద్యశాలలు పనిచేస్తున్నాయి. ఇందులో బహుళార్థ పశు వైద్యశాల 1, ప్రాంతీయ పశు వైద్యశాలలు 18, పశు వైద్యకేంద్రాలు 84, గ్రామీణ పశువైద్యశాలలు 55, రైతు భరోసా కేంద్రాలు 408 ఉన్నాయి.

జిల్లాలో 35.46 లక్షల పశువులు

ప్రకాశం జిల్లాలో 35,46,289 పశువులు ఉన్నాయి. ఇందులో తెల్ల పశువులు 56,332, నల్ల పశువులు 6,71,812, గొర్రెలు 15,67,122, మేకలు 4,17,589, కోళ్ళ 8,33434 ఉన్నాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు పశు గణన కార్యక్రమాన్ని జిల్లాలో చేపట్టాం. ఇప్పటి వరకు సుమారు 60 శాతం గణన పూర్తయింది.

పశు పోషకులకు రూ.233.17 కోట్లు

2025-25 ఆర్థిక సంవత్సరంలో పశు కిసాన్ క్రెడిట్ కార్డుల ద్వారా 27,217 పశు పెంపకందారులకు రూ.233,17 కోట్లు మంజూరు చేశాం.

1075 మినీ గోకులాల నిర్మాణం

జాతీయ గ్రామీణ ఉపాధి హామీలో 1075 మినీ గోకులాల నిర్మాణం చేపట్టనున్నాం. 90 శాతం సబ్సిడీపై పశువుల షెడ్ నిర్మాణం, 70 శాతం సబ్సిడీపై గొర్రెలు, మేకలు, కోళ్ళ షెడ్ నిర్మాణం కోసం పశు యజమానుల నుంచి మండల పశు సంవర్ధక అధికారులు దరఖాస్తులు తీసుకున్నారు. వాటిని జిల్లా నీటియాజమాన్య సంస్థ మండల అసిస్టెంట్ ప్రాజెక్ట్ అధికారికి పంపారు. 1075 మినీ గోకులాల నిర్మాణం లక్ష్యం కాగా ఇప్పటి వరకు 806 మినీ గోకులాల నిర్మాణాలు పూర్తి కాగా మిగిలిన 269 నిర్మాణంలో ఉన్నాయి.

పశు బీమా పథకం అమలు

పశు బీమా కార్యక్రమంలో రైతుల పశువులు, గేదెలకు 3 వేలు (ఒక్కో జంతువుకు 3 సంవత్సరాల పాటు రూ.288), గొర్రెలు, మేకలు పందులకు 6 వేలు.. 85 శాతం సబ్సిడీతో బీమా పొందవచ్చు.

రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ పంపిణీ

2025-26 ఆర్థిక సంవత్సరంలో రైతు సేవా కేంద్రాల ద్వారా పేద రైతులకు 75 శాతం సబ్సిడీతో 142 మెట్రిక్ టన్నులు, 100 శాతం సబ్సిడీతో 90 మెట్రిక్ టన్నుల పశుగ్రాసం విత్తనాలు, 60 శాతం సబ్సిడీతో 176 టన్నుల దాణామృతం, 40 శాతం సబ్సిడీతో 40 చాప్ కట్టర్లు, 50 శాతం సబ్సిడీతో 250 మెట్రిక్ టన్నుల సమీకృత దాణా పంపిణీ చేశాం.

రౌడీషీటర్లకు సిఐ సుబ్బారావు కౌన్సిలింగ్

ప్రజాశక్తి-మార్కాపురం

సమాజంలో మంచి నడవడికతో మెలగాలని రౌడీషీటర్లకు మార్కాపురం సిఐ పి సుబ్బారావు ఆదివారం కౌన్సిలింగ్ నిర్వహించారు. పట్టణ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఈ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో మార్కాపురం పట్టణ ఎస్ఐలు ఎం సైదుబాబు, డాక్టర్ ఎం రాజమోహన్‌రావు, మార్కాపురం రూరల్ ఎస్ఐ పి అంకమరావు పాల్గొన్నారు.